# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 59, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం -17 - మే - 2025


## రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే

- సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం
- మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి



- జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది



- 'కొండా సురేఖకు నా అభినందనలు'
- ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్
- ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది.

## 'సురేఖ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రేవంత్ కమీషన్ల సంగతేంటి?'

- ఏయే మంత్రి ఎంత కమీషన్లు తీసుకున్నారో దర్యాప్తు చేపట్టాలి



- కొండా సురేఖ మంత్రులు కమిషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరం
- రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నారు
- మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలి

# ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు

- రూ.22 వేల కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కాంప్లెక్స్ నిర్మాణం
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏపీని క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి




అనంతపురం : ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజకవర్గం, బేతపల్లి గ్రామంలో రెన్యూ పవర్ సంస్థ ఏర్పాటు చేయనున్న రూ.22 వేల కోట్ల విలువైన భారీ హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "రెన్యూ పవర్ ప్రాజెక్టుకు మనం వేస్తున్న పునాదిరాయి, భారతదేశ క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాదిరాయి వంటిది. రూ.22 వేల కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు కేవలం గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు ఊతమిస్తుంది" అని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ కాదని, అదొక ఉద్యమమని, భవిష్యత్ తరాలకు ఇదొక వారధి అని ఆయన అభివర్ణించారు. "రెన్యూ పవర్ వారి మిగతా..2లో

## చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీలో పెట్టుబడులు



- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయన్న మంత్రి
- బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ
- 2,300 ఎకరాల్లో రూ.22వేల కోట్లతో రెవెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటు

అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏపీకి వివిధ సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టడానికి సీఎం చంద్రబాబు బ్రాండే దోహపడిందన్నారు. మిగతా..2లో

## తిరుమలలో అత్యున్నత స్థాయి భద్రతకు కార్యాచరణ.. 14 ప్రవేశ ద్వారాలలో నిఘాకు చర్యలు

అన్నమయ్య భవన్‌లో నిన్న తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం

ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరు

అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన సమావేశం




తిరుపతి: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన మిగతా..2లో



## గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. 80 మంది దుర్మరణం

గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 80 మంది పాలస్తీనియన్లు మృతి

ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆసుపత్రిలో 54 మృతదేహాలు నమోదు

దాడులతో గాజా యూరోపియన్ ఆసుపత్రి (క్యాన్సర్ ఆసుపత్రి) సేవలు బంద్

# ఆపరేషన్ సిందూర్ ట్రైలరే, అసలు సినిమా ముందుంది

- ఆపరేషన్ సిందూర్ ట్రైలరేనన్న రాజ్‌నాథ్ సింగ్
- సమయం వచ్చినప్పుడు పూర్తి సినిమా చూపిస్తామని వ్యాఖ్య
- ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తే పాక్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక
- బ్రహ్మోస్ క్షిపణి దెబ్బకు పాక్ దిగివచ్చిందన్న రక్షణ మంత్రి
- 23 నిమిషాల్లోనే పాక్‌లో ఉగ్ర మూకలను దెబ్బతీశామని వెల్లడి



ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగిసిపోలేదని, ప్రపంచం ఇప్పటివరకు చూసింది కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, సరైన సమయం వచ్చినప్పుడు భారత సాయుధ దళాలు పూర్తి సినిమా చూపిస్తాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఉన్న భారత వైమానిక దళ స్థావరంలో శుక్రవారం ఎయిర్ వారియర్స్, భద్రతా దళాలను ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అందరూ ఇప్పటిదాకా చూసింది మిగతా..2లో



## 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

కశ్మీర్‌లో భద్రతా బలగాల జాయింట్ ఆపరేషన్

కాశ్మీర్ లోయలో భద్రతా బలగాల సంయుక్త చర్యలు

గత 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

షోపియాన్, ట్రాల్ ప్రాంతాల్లో రెండు వేర్వేరు ఆపరేషన్లు

ఉగ్ర కార్యకలాపాల నేపథ్యంలో వ్యూహాలు సమీక్షించామన్న అధికారులు

కాశ్మీర్‌లో ఉగ్రవాద వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలిస్తామన్న ఐజీపీ

# 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'



హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అత్యధికంగా 17, 162 మెగా వాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025- 26 లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుం దని, 2034..35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. రైల్వే లైన్లు, మెట్రో , ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోంది. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఎ తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సిటీ లో మిగతా..2లో

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

"క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం"

తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు.

ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు



వరంగల్: ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. "క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. మిగతా..2లో

# 'సురేఖ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రేవంత్ కమీషన్ల సంగతేంటి?'

హైదరాబాద్: తెలంగాణలో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రులు కమీషన్లు తీసుకోకుండా సంతకాలు చేయరు అని మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. దీంతో, ఆమె వ్యాఖ్యలపై తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ.. ఏయే మంత్రి ఎంత కమీషన్లు తీసుకున్నారో దర్యాప్తు చేపట్టాలని రేవంత్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మంత్రులు కమిషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరం. అంటే రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ఇదే డిమాండ్ చేస్తున్నాం. ఏయే శాఖ మంత్రి ఎంత తీసుకున్నారో దర్యాప్తునకు ఆదేశించాలి. మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలి అని వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్ర.. ఇదే సమయంలో తిరంగా యాత్రపై మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో 26 మందిని ఉగ్రమూకలు హతమార్చారు. మానవత్వం లేకుండా పిల్లల ముందు తండ్రిని, భార్య ముందు భర్తను పేర్లు అడిగి హతమార్చారు. మానవ సమాజానికే సవాల్ గా మారిన ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. పాకిస్తాన్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను పేల్చివేశాం. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేయడం జరిగింది. ఉగ్రవాద చర్యలతో మనదేశం బలవుతూనే ఉంది. జమ్ముకశ్మీర్‌లోనే 46 వేల మందిని ఉగ్రమూకలు బలితీసుకున్నాయి. మన సైనికులు నూతన చరిత్రను ప్రారంభించారు. గతంలో ఉగ్రమూకలు దాడి చేసినప్పుడు.. మరణించినవారి ఫోటో దగ్గర గులాబీ పువ్వు పెట్టడం వరకే పరిమితం అయ్యే వాళ్ళం. 2009లో 40 మందిని ఊచకోత కోశారు. భారత్‌పై దాడి చేస్తే ప్రతీకారం ఎలా ఉంటుందో చూపించాం. ఉగ్రవాదుల శిక్షణ కార్యక్రమాలు, ఉగ్రవాదుల నివాసాలను ధ్వంసం చేశాం. కరడుకట్టిన ఉగ్రవాదులను అంతం చేశాం. పాకిస్తాన్ పిల్ల చేష్టలతో దాడికి ఒడిగట్టింది.. భారత సైన్యం తిప్పికొట్టింది. ఆపరేషన్ సిందూర్ ఆగలేదు.. ఇంకా కొనసాగుతోంది. రక్షణ రంగంలో ప్రతి సైనికుడు రాణించారు. ఎస్-400, బ్రహ్మోస్త్రం పనితీరు దేశ ప్రజలు గమనించారు. భారత ఆర్మీకి అన్ని రకాలుగా సమకూర్చడం జరిగింది. ఆర్మీకి అవసరమైన వాటిలో 35 శాతం మనమే సమకూర్చుకున్నాం. మిథానీ, DRDAలో వసతులు మెరుగు పరుస్తున్నాం. ఆర్డినెన్సు ఫ్యాక్టరీలను మరింత సంసిద్ధం చేసుకున్నాం. పాకిస్తాన్‌ను ప్రపంచం ముందు దోషిగా నిలబెడతాం. భారత సైనికులు అనుసరించిన స్ట్రాటజీని ప్రపంచం మొత్తం చూసింది. రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అన్ని రాజకీయ పార్టీలను, ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆహ్వానిస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది

హైదరాబాద్: మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. మంత్రులు కమిషన్లు తీసుకోకుండా ఏ పనిచేయరంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'కనీసం ఇప్పటికైనా కొన్ని నిజాలు బయట పెట్టినందుకు మంత్రి కొండా సురేఖకు నా హృదయపూర్వక అభినందనలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది. ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్. అంతేకాదు, ఈ ప్రభుత్వంలో ఫైల్స్‌పై సంతకం చేసేందుకు మంత్రులు, వారి సహచర మంత్రులు 30శాతం కమిషన్ తీసుకుంటున్నారు. ఇదే కమిషన్ల వ్యవహారంలో సచివాలయంలో పలువురు కాంట్రాక్టర్లు ధర్నా చేసిన విషయం గుర్తుందా? అని ప్రశ్నించారు. ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది. ఈ సందర్భంగా కొండా సురేఖని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. కమిషన్లు తీసుకుంటున్న మంత్రుల వివరాల్ని బయటపెట్టాలి. ప్రజల ముందు బహిర్గతం చేయాలని అన్నారు. ఇదే అంశంపై రాహుల్ గాంధీ,రేవంత్‌రెడ్డిలు వారి సొంత కేబినెట్ మంత్రి చేసిన ఆరోపణలపై మీరు దర్యాప్తుకు ఆదేశించగలరా?'అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

### రికార్డు సృష్టించేలా విశాఖలో

## అంతర్జాతీయ యోగా డే

అమరావతి: రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలన్నారు. జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నెల రోజుల పాటు యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. విశాఖలో లక్షల మందితో కలిసి ప్రధాని మోదీ యోగాసనాలు వేస్తారని, ఆర్‌కే బీచ్ నుంచి సముద్రతీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహించనున్నట్టు వెల్లడించారు. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలని సీఎం అన్నారు.

### గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు..

## 80 మంది దుర్మరణం

గాజా: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. గురువారం జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 80 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది గాయపడ్డారని పాలస్తీనా వైద్య వర్గాలు వెల్లడించాయి. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంలో జరిగిన దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా 54 మంది మరణించినట్లు నాసర్ ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడుల కారణంగా గాజాలో క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించే ఏకైక ఆసుపత్రి అయిన గాజా యూరోపియన్ హాస్పిటల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని అక్కడి ఆరోగ్య అధికారులు తెలిపారు. ఆసుపత్రి మౌలిక వసతులు, మురుగునీటి లైన్లు దెబ్బతినడంతో పాటు, అంతర్గత విభాగాలు ధ్వంసమయ్యాయని, ఆసుపత్రికి దారితీసే రహదారులు నాశనమయ్యాయని వారు వివరించారు. గాజా నగరం మరియు ఉత్తర గాజాలోని ఇతర ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మరో 26 మంది మరణించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో హమాస్‌ను ఓడించే ప్రయత్నాలలో భాగంగా ఇజ్రాయెల్ సైన్యం పూర్తి శక్తితో గాజాలోకి ప్రవేశిస్తుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం హెచ్చరించిన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. మార్చి 18న రెండు నెలల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ గాజాలో భారీ సైనిక చర్యలను తిరిగి ప్రారంభించింది. అప్పటి నుండి 2,876 మంది పాలస్తీనియన్లు మరణించగా, 7,800 మందికి పైగా గాయపడ్డారు. అక్టోబర్ 7, 2023న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి మొత్తం పాలస్తీనియన్ల మరణాల సంఖ్య 53,010కి చేరుకుందని గాజా ఆరోగ్య అధికారులు గురువారం తెలిపారు. పౌరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ "జనావాసాలను ఖాళీ చేయించి, ప్రదేశాలను కుదించే" విధానాన్ని అనుసరిస్తోందని గాజాలోని పౌర రక్షణ విభాగం ప్రతినిధి మహమూద్ బసల్ ఆరోపించారు. పాఠశాలలు, నిరాశ్రయుల శిబిరాలపై దాడులు జరుగుతాయనే భయంతో వేలాది మంది రాత్రుళ్లు వీధుల్లో గడిపారని, బాధితుల వద్దకు సహాయక బృందాలు చేరుకోకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటున్నాయని, పౌర రక్షణ మౌలిక సదుపాయాలను క్రమపద్ధతిలో నాశనం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మార్చి 2 నుండి గాజాకు ఎలాంటి మానవతా సహాయం అందలేదని, గాజాలో అర మిలియన్ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

## 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

ఢిల్లీ: కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాయి. గత 48 గంటల్లో చేపట్టిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారులు శుక్రవారం శ్రీనగర్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది కుమార్, విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి, సీఆర్పీఎఫ్ ఐజీ మితేష్ జైన్ పాల్గొన్నారు. ఐజీపీ వీకే బిర్ది కుమార్ మాట్లాడుతూ, "కాశ్మీర్ లోయలో పెరిగిన ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించుకున్నాయి. ఈ సమీక్ష అనంతరం ఆపరేషన్లపై మరింత దృష్టి సారించాం. ఈ సమన్వయం, పెరిగిన ఏకాగ్రతతో గత 48 గంటల్లో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించాం. షోపియాన్‌లోని కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఈ ఆపరేషన్లలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి మేము కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ల గురించి వివరిస్తూ, ఈ రెండు ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. "మే 12న కెలార్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉగ్రవాద బృందం సంచరిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. మే 13 ఉదయం, కొంత కదలికను గుర్తించిన మా బృందాలు ఉగ్రవాదులను హెచ్చరించగా, వారు కాల్పులతో ప్రతిస్పందించారు. మా దళాలు వారిని మట్టుబెట్టాయి" అని ఆయన వివరించారు. "ట్రాల్ ప్రాంతంలోని ఒక గ్రామంలో రెండో ఆపరేషన్ జరిగింది. మేము గ్రామాన్ని చుట్టుముడుతుండగా, ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లలో స్థానాలు ఏర్పరచుకుని మాపై కాల్పులు జరిపారు. ఈ సమయంలో, గ్రామస్తులైన పౌరులను రక్షించడం మాకు పెద్ద సవాలుగా మారింది. ఆ తర్వాత ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం. హతమైన ఆరుగురు ఉగ్రవాదుల్లో షాహిద్ కుట్టే అనే వ్యక్తి ఒక జర్మన్ పర్యాటకుడిపై దాడితో సహా రెండు పెద్ద దాడుల్లో పాల్గొన్నాడు. నిధుల సమీకరణ కార్యకలాపాల్లో కూడా అతడి ప్రమేయం ఉంది" అని మేజర్ జనరల్ ధనంజయ జోషి తెలిపారు.

## త్వరలోనే పుతిన్‌తో ముఖాముఖి భేటీ: ట్రంప్

అబుదాబీ: రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తుర్కియే వేదికగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు మొదలయ్యాయి. అయితే, వీటికి పుతిన్ గైర్హాజరయ్యారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తాను పుతిన్ తో ముఖాముఖి భేటీ కానున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా పర్యటన ముగించుకుని ట్రంప్ అమెరికా తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన.. రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చల అంశాన్ని ప్రస్తావించారు. "ఈ చర్చలకు పుతిన్ హాజరుకాకపోవడం నన్నేమీ ఆశ్చర్యపర్చలేదు. ఎందుకంటే నేను లేకుండా ఆయన అక్కడకు వెళ్లరు. బహుశా మేమిద్దరం కలుసుకునే సమయం వచ్చినట్లు ఉంది. వీలైనంత త్వరలోనే పుతిన్‌తో నేను ముఖాముఖిగా సమావేశమవుతా" అని ట్రంప్ వెల్లడించారు. తన కుమార్తె టిఫనీ బిడ్డకు జన్మనిచ్చిందని, అందుకే తాను వెంటనే అమెరికా వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే రష్యా మాత్రం ఎలాంటి నిర్ణయమూ చెప్పలేదు. ఈ క్రమంలోనే తుర్కియే వేదికగా ఇరు దేశాలు శాంతి చర్చలు ప్రారంభించాయి. మూడేళ్ల యుద్ధంలో ఇరు దేశాల మధ్య నేరుగా చర్చలు జరగడం ఇదే తొలిసారి. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన బృందంతో హాజరయ్యారు. కానీ, పుతిన్ మాత్రం తన స్థానంలో కేవలం ప్రతినిధుల బృందాన్ని పంపించారు. దీనిపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. యుద్ధాన్ని ముగించడం రష్యాకు ఇష్టం లేదని ఆరోపించారు.

# ఆపరేషన్ సిందూర్ ట్రైలరే,అసలు సినిమా ముందుంది

మొదటి పేజి తరువాయి



అందరూ ఇప్పటిదాకా చూసింది ఒక ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినప్పుడు భారత సాయుధ దళాలు పూర్తి చిత్రాన్ని ప్రదర్శిస్తాయి" అని ఆయన స్పష్టం చేశారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో కలిసి వైమానిక స్థావరాన్ని సందర్శించిన రక్షణ మంత్రి, ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా నిర్వహించినందుకు దళాలను అభినందించారు. తమ గడ్డపై ఉగ్రవాద ఫ్యాక్టరీలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మోస్ క్షిపణి శక్తిని పాకిస్థాన్ గుర్తించక తప్పలేదని అన్నారు. "పదేపదే నేరాలు చేసేవారిని ఎలాగైతే నిఘాలో ఉంచుతారో, అలాగే పాకిస్థాన్‌ను కూడా మేము ప్రొబేషన్‌లో ఉంచాం. కాల్పుల విరమణ అంటే చర్యలు పూర్తిగా ఆగిపోయినట్టు కాదు. ఒకవేళ పాకిస్థాన్ తన పద్ధతులు మార్చుకోకుండా మళ్లీ దుస్సాహసాలకు పాల్పడితే, మన దళాలు గట్టి గుణపాఠం చెబుతాయి... మళ్లీ చెబుతున్నా!" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "మన దేశంలో 'పగటిపూట చుక్కలు చూపించడం' అనే ఒక సామెత ఉంది. మేడ్ ఇన్ ఇండియా బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు 'రాత్రి చీకటిలో పగటి వెలుగు' చూపించింది" అంటూ రాజ్‌నాథ్ సింగ్ గర్జించగా, దళాలు హర్షధ్వానాలతో మద్దతు తెలిపాయి. "పాకిస్థాన్‌లో పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని అణచివేయడానికి భారత వైమానిక దళానికి కేవలం 23 నిమిషాలు సరిపోయాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో మీరు చేసిన పని మా అందరికీ గర్వకారణం" అని ఆయన సైనికులను ఉద్దేశించి అన్నారు. దేశాన్ని భయభ్రాంతులకు గురిచేసే వారిని క్షమించే ధోరణికి బదులు, కఠినంగా శిక్షించే చర్యలకు ప్రాధాన్యతనిచ్చే భారతదేశ నూతన భద్రతా సిద్ధాంతాన్ని పునరుద్ఘాటిస్తూ, ప్రపంచంలో ఎక్కడైనా ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించి, దానికి బాధ్యులైన వారిని శిక్షిస్తామని ఆయన ప్రతినబూనారు. "ఆపరేషన్ 'సిందూర్' అంటే, అది కేవలం అలంకరణకు చిహ్నం కాదని, మీ పరాక్రమానికి, దృఢ సంకల్పానికి నిదర్శనమని మీరు ప్రపంచానికి చాటిచెప్పారు" అని సైనికులతో అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కార్యక్రమంలో భాగంగా పాకిస్థాన్‌కు నిధులు సమకూర్చడాన్ని కూడా రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. "అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అందుకున్న నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసమే ఖర్చు చేస్తుంది" అని ఆయన ఆరోపించారు. బెయిలౌట్ ప్యాకేజీపైనే ఎక్కువగా ఆధారపడుతున్న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇటీవల 1.023 బిలియన్ డాలర్ల రెండో విడత నిధులను విడుదల చేసిన విషయం గమనార్హం.

## 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'

మొదటి పేజి తరువాయి




విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సీటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలి. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని పుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

మొదటి పేజి తరువాయి



సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

## చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీలో పెట్టుబడులు

మొదటి పేజి తరువాయి



సీఎం చంద్రబాబు బ్రాండే దోహదపడిందన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు శుక్రవారం నాడు మంత్రి లోకేశ్ భూమిపూజ చేశారు. 2,300 ఎకరాల్లో రూ.22 వేల కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో పదివేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఏపీ గడ్డపై ఉత్పత్తి అయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా... దేశ అవసరాలకు కూడా ఉపయోగపడనుందని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లపై గుంతలను పూడ్చలేకపోయిందని దుయ్యబట్టారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేకపోయారన్నారు. అలాంటిది, ఇప్పుడు టీసీఎస్, టాటా ఎనర్జీతో పాటు పలు ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు.

### తిరుమలలో అత్యున్నత స్థాయి భద్రతకు కార్యాచరణ..

## 14 ప్రవేశ ద్వారాలలో నిఘాకు చర్యలు




తిరుపతి: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ... ఇటీవల పహల్గాం ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశం అని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు, టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. అంతకు ముందు టీటీడీ ఇన్‌ఛార్జి సీవీఎస్ఓ, తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, అలాగే ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. అలాగే ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బృందాలకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ (కమాండర్) ఎస్పీ డా. గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్ హాఫీజ్, తిరుపతి డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, వివిధ భద్రతా దళ అధికారులు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు..



రాజన్న సిరిసిల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

### మెగా డీఎస్సీ గడువు పొడిగింపుపై

## మంత్రి లోకేశ కీలక వ్యాఖ్యలు

అమరావతి: మెగా డీఎస్సీ ద్వారా ఏపీ ప్రభుత్వం 16, 347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ గురువారంతో ముగిసింది. జూన్ 6 నుంచి పరీక్షలు జరగనున్నాయి. అయితే, ప్రిపరేషన్‌కు 90 రోజుల గడువు ఇవ్వాలని చాలా మంది అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటన చేసినప్పటి నుంచి ఇదే డిమాండ్ వినిపిస్తోంది. తాజాగా ఈ డిమాండ్‌పై ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

"డీఎస్సీ ఆపేందుకు వైసీపీ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. కొందరు సమయం పెంచాలంటున్నారు. గతేడాది డిసెంబర్‌లోనే మేము సిలబస్ ప్రకటించడం జరిగింది. ఏకంగా ఏడు నెలలు గడువిచ్చాం" అని ఆయన గుర్తు చేశారు. దీంతో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలతో మెగా డీఎస్సీ గడువు పెంపునకు అవకాశం లేదని క్లారిటీ ఇచ్చుటినట్లైంది.

ఏపీ మెగా డీఎస్సీ 2025 పూర్తి షెడ్యూల్ ఇలా..

ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల స్వీకరణ తేదీలు: ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు,మాక్ టెస్ట్‌లు: మే 20 నుంచి, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేదీ: మే 30 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ఏపీ డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు: జూన్ 6 నుంచి జులై 6 వరకు, ప్రాథమిక కీ విడుదల: అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజే ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ: ఆ తర్వాత ఏడు రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్ కీ: అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల, మెరిట్ జాబితా: ఫైనల్ కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత విడుదల .

## ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు

మొదటి పేజి తరువాయి

"రెన్యూ పవర్ వారి పునరుత్పాదక ఇంధన సముదాయ ప్రారంభోత్సవం... సాహసోపేతమైన నిర్ణయానికి, స్థిరమైన ప్రగతికి చిహ్నం. ఈ చారిత్రాత్మక క్షణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ రేపటి వెలుగుకు దారి చూపుతుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు... ఇది ఒక ఉద్యమం. ఈ రోజు మన కలలకు, భవిష్యత్ తరాలకు వారధి లాంటిది. భూమిపై సూర్యకాంతి, స్వచ్ఛమైన, అమూల్యమైన గాలి లభిస్తున్నపుడు భావితరం కోసం మరోగ్రహం కోసం ఎందుకు ఆలోచించాలి? శిలాజ ఇంధనాల నుండి భవిష్యత్ ఇంధనాల వినియోగం కోసం మేం ముందడుగు వేస్తున్నాం. భావితరాల కోసం ఒక ఉన్నత లక్ష్యంతో పని చేస్తున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోందని లోకేశ్ కొనియాడారు. "ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలను చూశారు. చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ భారతదేశ హరిత విప్లవానికి బ్లూప్రింట్‌గా మారింది" అని ప్రశంసించారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే టాటా పవర్, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్, వేదాంత సెరెంటికా, సెయిల్ ఇండస్ట్రీస్, బ్రూక్‌ఫీల్డ్ వంటి క్లీన్ ఎనర్జీ దిగ్గజాలను రాష్ట్రానికి రప్పించగలిగామని గుర్తుచేశారు.

ప్రాజెక్టు వివరాలు – ఉపాధి అవకాశాలు

అనంతపురంలో రెన్యూ సంస్థ నెలకొల్పనున్న ఈ పునరుత్పాదక ఇంధన కాంప్లెక్స్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశలో రూ.7 వేల కోట్ల పెట్టుబడితో 587 మెగావాట్ల సౌర, 250 మెగావాట్ల పవన, 415 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తం మీద రూ.22 వేల కోట్ల పెట్టుబడితో 1800 మెగావాట్ల సౌర, 1 గిగావాట్ పవన, 2000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను వివిధ దశల్లో నెలకొల్పుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

తిరిగి వస్తున్న పరిశ్రమలు – ప్రభుత్వ లక్ష్యాలు

ఐదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగం పునరుజ్జీవనం పొందుతోందని మంత్రి లోకేష్ అన్నారు. "గత ప్రభుత్వ




హయాంలో పారిపోయిన కంపెనీలన్నీ మళ్లీ ప్రజాప్రభుత్వంలో తిరిగి వస్తున్నాయి. చంద్రబాబు బ్రాండ్ వల్లే రెన్యూ వంటి సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి," అని పేర్కొన్నారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. వచ్చే నెలలోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలనే లక్ష్యంతోనే ఇటువంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నామని, ఇక్కడ తయారయ్యే విద్యుత్ రాష్ట్రంతో పాటు దేశ అవసరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకువెళుతోందని, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి, సీఎం చంద్రబాబు విజన్ తోడైందని, ఏపీలో ఏర్పాటు చేస్తున్న ఈ కాంప్లెక్స్ దేశంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. స్థానిక రైతులు సహకరించాలని ఆయన కోరారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాకతో స్థానిక రైతులకు ఎకరాకు రూ.35 వేల వరకు కౌలు లభిస్తుందని, వారి పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కౌలు రైతులకు
## పంట సాగు హక్కు పత్రాలపై అవగహన కార్యక్రమం



నంద్యాల రిపోర్టర్ / మోహన్ (శుభోదయం న్యూస్ ): కౌలుకు భూమి సాగు చేస్తున్న ప్రతి రైతు పంట సాగుహక్కు పత్రాలు కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. గోస్పాడు మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం కౌలు రైతులకు పంట సాగు హక్కుపత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .హక్కు పత్రాలు కలిగి ఉంటేనే ప్రభుత్వం అందించే ఇన్పుట్ సబ్సిడీ, క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ ,పంట దిగుబడుల అమ్మ కాలకు, పంట రుణాలు అవకాశం ఉంటుందన్నారు .పంట సాగుదారు హక్కు పత్రాలు ఇవ్వడానికి భూ యాజమానులు సహకరించాలని వారు భూమిపై ఎటువంటి హక్కులు కోల్పోరని, కేవలం కౌలు దారులకు సాగు చేసిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని ఈ పత్రం యొక్క కాల పరిమితి కేవలం 11 నెలలు అని తెలపడం అయినది. కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు వీఆర్వోలను సంప్రదించి పంట సాగు పత్రాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డివిజన్ ఏ డి ఏ రామ్మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి స్వప్నిక రెడ్డి, ఏ ఈ ఓ లు రామకృష్ణ, నాగార్జున అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేష్ రైతులు పాల్గొన్నారు.

## మంచి నీటి సమస్యకు పరిష్కారం
## తెదేపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు శుభోదయం (న్యూస్) : నియోజకవర్గ శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలతో ఎన్టీఆర్ నగర్ నందు మంచినీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని ఆ ప్రాంత మున్సిపల్ డి ఇ సంజయ్ కుమార్ ని ఆదేశించారు. మున్సిపల్ డి.ఇ,వాటర్ సప్లై సిబ్బంది సుధాకర్, సచివాలయ సిబ్బంది మౌనిక, గురు ప్రసాద్, పద్మనాభం రెడ్డి, పిట్టర్ గురవయ్య, రసూల్ లు ఎన్టీఆర్ నగర్ పైప్ లైన్ మొత్తాన్ని పూర్తిగా పరిశీలించి నీటి సమస్య లేకుండా సిబ్బందికి పళ్ళు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వార్డు ఇన్చార్జి మరియు రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి మాట్లాడుతూ.... పట్టణంలోని ఏ ఒక్క ఇంటికి కూడా నీటి సమస్య లేకుండా చూడాలనేదే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆలోచన అని ప్రజలు మంచినీటికి ఇ,,,,,బబబ్బంది పడకుండా ఎమ్మెల్యే అనేగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని అభివృద్ధిలో ఎమ్మెల్యే పరుగులు తీస్తున్నారని ఇందుకోసం అనేక సంస్కరణలు తీసుకువస్తున్నారని తెలిపారు.నెమళ్ళూరు బుజ్జి అధికారులతో మాట్లాడుతూ1989 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యేగా వున్న స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి వేసిన మంచినీటి పైప్‌లైనే ఇప్పటికీ మరమ్మత్తులకు గురైందని, కొత్త పైప్ లైన్ ప్రతిపాదనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళాలని అధికారులను బుజ్జి విన్నవించారు.ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు వార్డు కార్యకర్తలు పూల సురేష్, మంగమ్మ, అబ్దుల్లా, రమేష్, బిజెపి నాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు.

## బిసి నాయకుడికి ఆత్మీయ పరామర్శ గాలి మురళి నాయుడు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): నట సింహం, హిందూపురం శాసనసభ్యుడు, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు, తొట్టంబేడు మండల ఆత్మీయ బిసి నాయకుడిని పరామర్శించినట్లు తెలుగుదేశం పార్టీ, తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళినాయుడు తెలిపారు.తెలుగుదేశం పార్టీ బలం, బలగాలుగా చెప్పుకునే బిసి వర్గాలలో క్రియాశీలకంగా ఉంటూ, తెలుగుదేశం పార్టీకి క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా, చిత్తశుద్ధితో పనిచేస్తున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ బిసి నాయకుడు చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం అలియాస్ మణి ని, తొట్టంబేడు గ్రామంలో గల ఆయన స్వగృహంలో ఈరోజు గాలి మురళి నాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పరామర్శించారు.కంటికి ఇన్ఫెక్షన్ సోకడంతో ఇటీవల తిరుపతిలో గల ప్రముఖ కంటి వైద్యశాలలో శస్త్రచికిత్స చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని గాలి మురళి నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పలువురు వెళ్ళి మణిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సీనియర్ నాయకులు పేట బాలాజీ రెడ్డి, దొరైరాజ్ రెడ్డి, వజ్రం కిషోర్, భాస్కర్ ముదిరాజ్, నాగరాజు, అయ్యప్ప, వెంకీ, భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డా వల్లభనేని వంశీమోహన్ఏ విధమైన హాని జరిగిన ముఖ్యమంత్రి చంద్ర బాబు,నారా లోకేష్ లు భాద్యత వాహించాలి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణిగన్నవరం మాజీ ఎమ్ ఎల్ ఏ డా వల్లభనేని వంశీ మోహన్ పై పెట్టిన ప్రతి కేసు అక్రమమైనది గన్నవరం నియోజకవర్గం ప్రజలు భావిస్తున్నారు అని వంశీ కి ఏ విధమైన హాని జరిగిన పూర్తి భాద్యత ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు,నారా లోకేష్ దే భాద్యత అని ఈ రోజు గన్నవరం జడ్పీటీసీ కార్యాలయంలో పత్రికలకు ప్రెస్ నోట్ విడుదల చేసినట్లు గన్నవరంజడ్పీటీసిఅన్నవరపుఎలిజబెత్ రాణి తెలిపారు.వంశీ నిపేదప్రజలహృదయలలో నుండి ఎవరు తీసివేయలేరు అన్నారువైస్సార్సీపీనాయకులు కార్యకర్తలు వందలాది మందిపై మహిళలతో సహా అక్రమ కేసులు పెట్టి నెలలు తరబడి జైలులో పెట్టాం అని కూటమి నాయుకులు కొందరు శునకానందం పడతారేమో గాని నియోజకవర్గ ప్రజలు మాత్రం తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని ఆమే హెచ్చిరించారు.వంశీ కిఏసంబంధంలేకపోయినాఆయనపై చాలా అక్రమ కేసులు పెట్టారు ఆయనను జైలు లో 100 రోజులు పైన ఉంచారు. దారిదాపు అన్ని కేసులలో బెయిలు పొందారు జైలులో వంశీ ఆనారోగ్యానికి గురి అయ్యారు అని తెలిసి ప్రజలు చాలా మంది అందోళనకు గురియ్యారు. వంశీ గత పదిహేను సంవత్సరాలనుండి నియోజకవర్గంలో పేద ప్రజల ఆపదలో ఆదుకునే ఆపద్భాందువుడు అని భాదపడే ప్రజలేగాని యవరికి హాని తల పెట్టని మహా నాయుకుడు అని అన్నారు.రెండు సంవత్సరాల క్రితం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అక్రమంగా 71 వ ముద్దాయిగా చేర్చింది కూటమి ప్రభుత్వం.ఈ కేసులో ఎక్కువ మంది కి బేయిల్ వచ్చింది ఈ రోజు ఆ కేసులో బేయిల్ ఆర్డర్ చెపుతారని మీడియా ద్వారా ప్రజలు తెలుసుకొని ఆనంద పడ్డారు. కాని రెడ్డ్ బుక్ రాజ్యాంగం పధకం ప్రకారం వంశీ గారిని జైలు నుండి బయటకు వస్తారు అని రానియ్యకుండా ఉండటానికి మరో అక్రమ కేసు పీ టి వారెంట్ వచ్చినట్లు ఈ రోజు నూజివీడు కోర్టుకు 2019 లో కేసు అని ఏ ఆధారాలు లేకపోయినా ముద్దాయిగా ఇరికించరని మీడియద్వారా తెలిసిన తరువాత ప్రజలు వంశీ ప్రాణహాని తల పెట్టే విధంగా ఉందని అందోళనకు గురి అవుతున్నారని ఆమే అన్నారు.వంశీ ఏ విధమైన హాని జరిగిన ఆది ముఖ్యమంత్రి,నారా చంద్ర బాబు నాయుడు,నారా లోకేష్ ల దే భాద్యత వాహించలిసి ఉందని జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి హెచ్చరించారు.

## చిలుకూరి శ్రీనివాస్ కు జన్మదిన శుభాకాంక్షలు
## తెలియజేసిన... కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



సంస్థాన్ నారాయణపురం, మే 16 (శుభోదయం న్యూస్): సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒట్టి కోటి శేఖర్,బల్గురి శివ, మారగొని శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## టీ5 కాలువకు నిధులు కేటాయించాలి
## అన్ని చెరువులకు నీరు నింపాలి
## పోస్ట్ కార్డుల ఉద్యమంలో మల్లపాలెం రైతులు




యర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి – కాకర్ల కోటయ్య, (శుభోదయం న్యూస్): టీ5 కాలువకు సర్వే నిర్వహించి, నిధులు కేటాయించి పనులు చేపట్టాలని రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టీసీఎచ్ చెన్నయ్య అన్నారు. శుక్రవారం మల్లాపాలెం గ్రామంలో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో తీగలేరు కాలువ కోసం పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన టి5 కాలువ అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. టి5 కాలువ పూర్తయితే పుల్లలచెరువు మండలంలోని 44 గ్రామాలకు త్రాగు, సాగునీరు అందుతే రైతాంగం సస్యశ్యామలంగా జీవనం గడుపుతారని అన్నారు. టీ5 కాలువ కింద 11,700 ఎకరాలకు సాగునీరు అందుతాయని తెలిపారు. టీ5 కాలువకు నిధులు కేటాయించి పూర్తిచేసి ఈ ప్రాంత రైతాంగానికి త్రాగు సాగునీరు అందించాలని కోరారు. అలాగే కోట్ల రూపాయల ఖర్చుతో గ్రామాలలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. టి ఫై కాలువ పూర్తయితే ఉమ్మడివరం దగ్గర ఉన్న ట్యాంకుకు నీరును నింపితే 45 గ్రామాలకు త్రాగునీరు అందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నిధులు కేటాయించి టి5 కాలువను పూర్తి చేయకపోతే రైతాంగం అనేక తీవ్రమైన ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తీగలేరు సాధన సమితి కార్యదర్శి జి.గురునాధం మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో వెనుకబడిన ప్రాంతాం పుల్లలచెరువు మండలం కరువు కాటకాలతో వ్యవసాయం చేయలేక నాన్న ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తీగలేరు వచ్చినట్లయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. అన్ని వర్గాల రైతులను కలుపుకొని పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించాలని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీగలేరు సాధన సమితి సభ్యులు రైతు సంఘం నియోజకవర్గం అధ్యక్షులు బాణాల రామయ్య, కుందూరి కోటిరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, శనగ సుబ్బారెడ్డి, మార్తాల నాగిరెడ్డి, నారు కొండారెడ్డి, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పోస్ట్ కార్డు ఉద్యమంలో పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ వారి మట్టి పరీక్ష -శిక్షణ వారం కార్యక్రమం





దోర్నాల మండలం రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :16.05.2025 న దోర్నాల మండలం లోని చింతల మరియు తుమ్మలబయలు గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు మట్టి నమూనాలు సేకరణ పై రైతులకు అవగాహనా కల్పించరు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి




రైతు తప్పనిసరిగా భూ సారా పరీక్షలు చేపించు కొని తద్వారా ఎరువుల యాజమాన్యం పాటించాలని అలాగే సూక్ష్మ పోసకాల యాజమాన్యం పాటించాలని తెలిపారు. అలాగే భూసారా పరీక్ష ఫలితల కార్డులను పంపిణి చేయడం జరిగింది. పట్టాలు ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట నమోదు సంఖ్య ను నమోదు చేసుకోవాలని, అలాగే అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు అవగాహనా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో విశ్వనాథ్, సిబ్బంది ప్రసాద్, సిబ్బంది రాజయ్య, కాసేయ్య రైతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జరిగిన పాటేల్ ఈశ్వర్ రెడ్డి కుమారుని పెళ్లి వేడుకలు...
### హాజరైన రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని పగిడిరాయి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పాటేల్ ఈశ్వర్ రెడ్డి కుమారుడు వంశీధర్ రెడ్డి, సుస్మిత ల పెళ్లి వేడుకలు శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోనే బళ్లారి పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు మండలంలోని తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి, సిపిఐ, సిపిఎం పార్టీల కు చెందిన రాజకీయ నాయకులతోపాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వివాహ వేడుకలకు హాజరైన ప్రముఖులకు రిటైర్డ్ విఆర్ఓ తిమ్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి లు స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి హరినాథ్ రెడ్డి ,కేడిఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మారెడ్డి, ఉప్పలపాడు మాజీ సర్పంచ్ చల్లా రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కుమారుడు రామ్మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి జగన్నాథ్ రెడ్డి, టిడిపి నాయకులు మనోహర్ చౌదరి, కొత్తూరు ప్రభాకర్ రెడ్డి, తిరుపాల్ నాయుడు, అప్ప వేణు, శ్రీనివాసులు గౌడ్, రాతన కృష్ణమూర్తి, ఉప్పర్లపల్లె మనోహర్, రాంపురం వెంకటరాముడు, మల్లయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు పగిడిరాయి బసిరెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, జిట్టా నగేష్, రాతన మోహన్ రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, బసిరెడ్డి, పగిడిరాయి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎర్ర మీసాల సుంకన్న ,డీలర్ సుంకన్న తదితరులు హాజరయ్యారు.

## మండల అధ్యక్షులు అడపా నాగరాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి






టీ.నర్సాపురం, శుభోదయం న్యూస్ : పోలవరం నియోజకవర్గంలో టి.నర్సాపురం మండల జనసేన పార్టీ అధ్యక్షులు అడపా నాగరాజు జన్మదిన వేడుకలను మండల జనసేన పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎపిగుంట, శ్రీ రామవరం వరకు కార్లు, బైక్ లతో ర్యాలీతో భారీగా తరలి వెళ్ళారు. ఎపిగుంట గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంకి అడపా నాగరాజు కూటమి నాయకులతో చేరుకున్న ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామవరం గ్రామంలో మండల అధ్యక్షులు అడపా నాగరాజు ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు ఏజెన్సీ టైగర్ కరాటం రాంబాబు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో జనసేన పార్టీని బలోపేతం చేసిన మండల అధ్యక్షులు నాగరాజుకు మొదటగా పోలవరం నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు తరుపున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అధికారం లోకి వచ్చిన సంవత్సరకాలంలో ఎన్నో సమస్యలను తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నాం అని, ఎన్డీయే ప్రభుత్వం యొక్క అభివృద్ధి ని ప్రజలకు కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాం అని మరో నాలుగేళ్లు కూడా ప్రజల్లో ఉంటూ చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అంటే జీవిత కాలం గుర్తుండేల నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతోందని మ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మనమిత్ర స్టాండ్స్ సచివాలయాలకు పంపిణీ కార్యక్రమం




నెల్లూరు జిల్లా ప్రతినిధి శ్రీనివాసులు (శుభోదయం న్యూస్): సైదాపురం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మనమిత్ర స్టాండ్స సచివాలకు పంపిణీ చేస్తూ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించింది . అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పురుషోత్తం శివకుమార్ మనమిత్ర స్టాండ్స్ ను సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ సేవలను పొందుటకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక వాట్సాప్ నెంబర్ 9552300009 మొబైల్ నెంబర్ను ఉపయోగించవచ్చని తెలిపారు.

## భూ రీ సర్వేను పరిశీలించిన నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్



నెల్లూరు జిల్లా ప్రతినిధి శ్రీనివాసులు(శుభోదయం న్యూస్) : సైదాపురం మండలంలోని తిప్పిరెడ్డిపల్లిలో భూ రీ సర్వేను పరిశీలించిన నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఈ సర్వే చేస్తున్న ఎమ్మార్వో మరియు సర్వేరు వెంకటేశ్వర్లు మరియు రెవెన్యూ సిబ్బంది ని మరియు సర్వే నిర్వహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

## వీరభద్ర స్వామి దేవస్థానంపై ప్రత్యేక పోస్ట్ కార్డులను విడుదల చేసిన సిపిఎంజి కె ప్రకాష్




లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్) : ఈరోజు లేపాక్షిలో నంది విగ్రహం తో కూడిన శాశ్వత తపాలా ముద్రను మరియు వీరభద్ర స్వామి దేవస్థానం పై ప్రత్యేక పోస్ట్ కార్డులను గౌరవ సిపిఎంజి శ్రీ కె ప్రకాష్ విడుదల చేశారు వారు మాట్లాడుతూ లేపాక్షి నంది యొక్క విశిష్టత తపాలా ముద్రణతో ప్రపంచ నలుమూలల విస్తరించడం జరుగుతుందని మరియు లేపాక్షి ప్రతిష్టత గురించి తెలియజేసినారు ఈ కార్యక్రమంలో కర్నూల్ రీజినల్ పోస్ట్మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర మరియు పోస్టల్ సూపర్డెంట్ శ్రీయు విజయకుమార్ , లేపాక్షి పుస్తక రచయిత శ్రీ చిదంబర రెడ్డి పోస్టల్ శాఖ సిబ్బంది మరియు లేపాక్షి ప్రజలు పాల్గొన్నారు.

## నూతన పెట్రోల్ బంకు దగ్గర షీల్డ్ మురళి గౌడ్ కి బహూకరించిన బీసీ నాయకులు పేరాల వెంకట సురేష్



(శుభోదయం న్యూస్) : బిసి సీనియర్ నాయకులు పేరాల వెంకట సురేష్ నూతన పెట్రోల్ బంక్ ఓపెనింగ్ లో భాగంగా బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఉప్పాల మురళి మర్యాదపూర్వకంగా గౌరవించి షీల్డ్ బహుకరించారు ఈ సందర్భంగా ఉప్పాల మురళి గౌడ్ మాట్లాడుతూ తోటి బీసీ నాయకుడిని ఆప్యాయతగా సన్మానించిన బీసీ నాయకులు పేరాల వెంకట సురేష్ కు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు పలాలమ్మ తల్లి గుడి పూజారి కృష్ణమూర్తి పెద్దోడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రంగుల, హరివిల్లుతో వసంతాలు ముగిసిన రేణుక ఎల్లమాంబ తిరునాళ్ల మహొత్సవం

సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): మండలంలోని మాచుపల్లి గ్రామంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న రేణుక ఎల్లమాంబ తిరుణాల మహొత్సవం శుక్రవారం రేణుక ఎల్లమాంబ, సమేత జమదగ్ని మూల విరాట్ ఉత్సవ విగ్రహాలు డప్పు వాయిద్యాల మధ్య ఒకరినొకరు వసంతాలు రంగులు పూసుకుంటూ గ్రామోత్సవం వైభవంగా జరిగింది ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ రేణుక ఎల్లమాంబ తిరుణాల మహొత్సవాలు గత ఐదు రోజులుగా జరుగుతున్నాయని శు క్రవారం వసంతాల వేడుకలతో ముగిశాయని ఉత్సవ మహొత్సవాలకు సహకరించిన దాతలకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన నల్లబోతుల వెంకటేశ్వర్లు



పామూరు, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి గారి అదేశాలమేరకు తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇన్నిమెర్ల గ్రామ పంచాయతీ టిడిపి అధ్యక్షుడిగా నలబోతుల వెంకటేశ్వర్లు గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో పామూరు మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు గారు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ,మండల,గ్రామ టిడిపి నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ రావు, యారవ ప్రసాద్ రెడ్డి, యస్.డి అమీర్ బాబు,సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీ నారాయణ, ఇర్రి కోటిరెడ్డి, క్లస్టర్ గుంటుపల్లి శ్రీను, తడికమల్ల సుబ్బారావు, యస్.మల్లికార్జున రెడ్డి, మినీగ నగేష్, డి.లక్ష్మీ నారాయణ రెడ్డి,మండ్ల రమణయ్య ఓబుళాపురం వినోద్, నలబోతుల నాగేంద్ర,ఆదోని నరసింహ,దుగ్గిరెడ్డి సుబ్బారెడ్డి యర్రగుంట్ల వెంకటేశ్వర్లు, తదితరులు హాజరయ్యారు.

## ఇటువంటి అనుమతులు లేకుండా సెల్ టవర్, ఫోర్ మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరి బాబు



పామూరు, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణ నందు ఎలాంటి గ్రామపంచాయితీ అనుమతులు లేకుండా నెల్లూరు రోడ్డు శ్రీ చైతన్య స్కూల్ వెనుక నిర్మిస్తున్నటువంటి సెల్ టవర్ నిర్మాణ పనుల్ని అడ్డుకున్న స్థానిక ప్రజలు రాత్రికి రాత్రే సెల్ టవర్ నిర్మాణం పామూరు గ్రామపంచాయతీ వారు నోటీసు ఇచ్చి ఆపమన్న కూడా లెక్కలేకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయి ఈ



టవర్ రేడియేషన్ వలన చిన్న పిల్లలకు పెద్దలకు మైగ్రేన్ మరియు క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున మినిమం 500 మీటర్ల దూరంలో సెల్ టవర్ ఉండాలి అనే నిబంధనలను తుంగలో తొక్కి నిర్మాణం చేపడుతుండగా స్థానిక శ్రీనగర్ కాలనీవాసులు పంచాయతీ ఈవో అరవింద మేడం గారికి ఎంపీడీవో బ్రహ్మయ్య గారికి ఎమ్మార్వో రమణారావు గారికి వినతిపత్రం అందజేసి నిర్మాణాన్ని వెంటనే ఆపించి ఇంతవరకు నిర్మించిన టవర్ ని డిస్మాటిల్ చేసి అక్కడ నుంచి తీసివేయవలసిందిగా కోరడం జరిగింది అధికారులు స్పందించి వెంటనే ఈ టవర్ ని అక్కడి నుంచి తీసివేయవలసిందిగా కోరడం జరిగింది.

## : నీళ్ల వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న.. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి




సంస్థాన్ నారాయణపురం, మే 16 (శుభోదయం న్యూస్): సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన నీళ్ల సాలమ్మ - కీర్తిశేషులు సత్తయ్య దంపతుల కుమారుడు రమేష్ గౌడ్ - రజిత దంపతుల వివాహము కొయ్యలగూడెం రిక్కల సత్తిరెడ్డి గార్డెన్ లో వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒట్టికోటి శేఖర్, వీరమల్ల పద్మయ్య గౌడ్, అంజయ్య గౌడ్, చిలుకూరి శీను, బల్గూరి శివ, దూసరి శ్రీశైలం గౌడ్, మారగోని శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలలో పాల్గొన్నమాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అందె నరేష్ యాదవ్



సంస్థాన్ నారాయణపురం, మే 16 (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన క్రీ.శే నీళ్ల సత్తయ్య నీళ్ల సాలమ్మ కుమారుడు, నీళ్ల రమేష్-రజిత దంపతుల వివాహం కొయ్యలగూడెం రిక్కల సత్తిరెడ్డి గార్డెన్ లో వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన సంస్థాన్ నారాయణపురం యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అందె నరేష్ యాదవ్, ఈ కార్యక్రమంలో మారగోని శంకర్,అంతటి స్వామి,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు సిలివేరు సైదులు,జర్నలిస్ట్ క్యూ న్యూస్ రిపోర్టర్ గంగాపురం సాయి గౌడ్,సిలివేరు శ్రీశైలం, మానుపూర్ దాసు, సురేపెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మహాకూటమి సభ్యులు



సంస్థాన్ నారాయణపురం, మే 16,(శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సమస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన క్రీ.శే,నీళ్ల సత్తయ్య- నీళ్ల సాలమ్మ కుమారుడు నీళ్ల రమేష్ - రజిత దంపతుల వివాహం కొయ్యలగూడెం రిక్కల సత్తిరెడ్డి గార్డెన్ లో వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సంస్థాన్ నారాయణపురం మహాకూటమి సభ్యులు, రసాల యాదయ్య సాగర్, ఉప్పల శీను, వీరమల్ల జంగయ్య గౌడ్, దూసరి శ్రీను, చిలువేరు బుగ్గ రాములు, సంస్థాన్ నారాయణపురం వార్త మిర్రర్ రిపోర్టర్ చిలువేరు జంగయ్య, బొడ్డుపల్లి సత్యనారాయణ, చిలువేరు రమేష్, శుభోదయం రిపోర్టర్ విడం సాయి కిషోర్ నేత, సింగం భాస్కర్, బద్దం లింగస్వామి ( స్టాలిన్),శికిలామెట్ల హెమెందేర్, బాకారం పృథ్వీరాజ్ మహాకూటమి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిందితుల అరెస్టు రిమాండ్ కు తరలింపు




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామం భీమ లింగం కత్వలో గత రెండు రోజుల క్రితం భువనగిరి సింగన్న గూడెంకు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బైరు సురేష్ అనే వ్యక్తి కేసును చేదించిన పోలీసులు 16/05/2025 రోజున భైరు మంగా మరణించిన వ్యక్తి భార్య మరియు పల్లెర్ల స్వామిలు కలిసి హత్య చేసినట్టు నిర్ధారించడం జరిగింది.ఈ హత్యకు కారణం వారి మధ్యన ఉన్న అక్రమ సంబంధం అని పోలీసులు కేసును చేదించారు. నిందితులను కోర్టు ముందు హాజరుపరచి రిమాండ్ కు తరలించామని స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు.

## రోడ్డుపై వృధాగా పారుతున్న గోదావరి జలాలు పట్టించుకోని అధికారులు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని పాత ఎంఆర్ఓ ఆఫీస్ దగ్గర గోదావరి జలాలు వృధాగా రోడ్డుపై పారుతున్న పట్టించుకోకుండా అలసత్వంతో వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి,విధుల పట్ల అలసత్వంగా వ్యవహరిస్తూ గోదావరి జలాల పైపు పగిలి 15 రోజులుగా నీరు వృధాగా రోడ్డుపై పారుతున్న పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకొని వెంటనే పైప్ లైన్ లీకేజ్ ని అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహా లు డిమాండ్ చేశారు.గత 15 రోజులుగా గోదావరి జలాలకుసంబంధించిన పైపులైను పగిలి పాత ఎంఆర్ఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో గోద బిక్షపతి ఇంటి వద్ద వృధాగా రోడ్డుపై పారుతున్న గోదావరి జలాల పైప్ లైన్ లీకేజీని పరిశీలించి నిరసన వ్యక్తం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ 15 రోజులుగా నీరు వృధాగా రోడ్డుపై పారుతున్న అధికారులు పట్టించుకోకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శమని వెంటనే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, 37 గ్రామపంచాయతీలు ఉన్న మండలంలోని కృష్ణా గోదావరి జలాలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఎక్కడ ఉంటారో అర్థం కావడం లేదన్నారు.ఇప్పటికైనా మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలని లేని పక్షంలో ఆందోళన నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడతాయని హెచ్చరించారు పై స్థాయి జిల్లా అధికారులు చూసి చూడనట్టు ఉదాసీనంగా వ్యవహరించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య, స్థానికకాలనీవాసులు,మునుకుంట్ల ధనుంజయ్య,కీర్తి రమేష్,మాజీ వార్డు సభ్యులు బత్తిని శేఖర్, కొండూరు పాండు, పోలేపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్ లో నేడు మా భాగవతి 21వ విశాల్ జాగరాన్ అమ్మవారి పూజలు




తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివ కుమార్,(శుభోదయం న్యూస్),మే 16:సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ లో మా భాగవతి 21వ విశాల్ జాగరన్ వేడుకలు నిర్వహించనున్నట్లు జాగరన్ మండల ప్రధాన కార్యదర్శి బీఎన్.శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం సికింద్రబాద్ జింఖానా గ్రౌండ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మా వైష్ణో దేవి జాగరన్ మండల్ ఆధ్వర్యములో ప్రతి ఏటా వైభవంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది కూడా ఈనెల 17న సాయంత్రం వేడుకలు ప్రారంభం కానునట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా హిందూ బంధువులు, సోదరులు భేదాభిప్రాయం లేకుండా జాగారాన్ వేడుకలో పాల్గొంటారని వెల్లడించారు. జమ్మూ నుండి కట్ర దేవాలయం లోని ప్రధాన అర్చకులు అఖండ జ్యోతి వెలిగించి అమ్మవారి పూజలు ప్రారంభిస్తారని ఉత్తర భారతదేశం సాంప్రదాయ పద్ధతిలో వేడుకలు జరగనున్నట్లుగా వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ గాయకులు లక్ వీర్ సింగ్ లక్మ ఆధ్వర్యంలో అమ్మవారి కీర్తనలు పాడి భక్తులను భక్తి పారవశ్యంలో నడిపించనున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ఈ ప్రత్యేక పూజ వేడుకల్లో సుమారు 7000 నుండి 10000 మంది భక్తులు హాజరవుతారని అంచనా తెలిపారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు సదుపాయాలు కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమానికి అనుమతులు ఇచ్చినందుకు కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో మధుకర్ నాయక్ కు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.నగరం లోని పలు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రతేక పూజలు నిర్వహిస్తారనీ తెలిపారు ఈ సమావేశం లో చైర్మన్ సురేందర్ జోషి,వైస్ చైర్మన్ వినోద్ పొద్దార్,ప్రెసిడెంట్ కైలాష్ చాంద్ అగర్వాల్,వైస్ ప్రెసిడెంట్ సంజయ్ అగర్వాల్,సందీప్ సింగ్,కోశాధికారి సందీప్ జోషి, ప్రధాన కార్యదర్శి బీ.ఎన్.శ్రీనివాస్,కన్వీనర్ రాజేందర్ అగర్వాల్, లక్ష్మి నారాయణ అగర్వాల్,సంజయ్ కుమార్ గోయల్,సర్వాన్ గోయల్,సంతోషి గోషి,సెక్రెటరీ రాజేష్ గోయల్,డిప్యూటీ సెక్రెటరీ హరి ఓం తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, పి ఎం ఏ వై, లబ్ధిదారుల వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలి

రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ



రామగుండం మండలం, రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్): ఇందిరమ్మ ఇండ్లు , పి ఎం ఎ వై , రేషన్ కార్డు లబ్దిదారుల వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో శుక్రవారం ఆయా ధరఖాస్తుల పరిశీలనా ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు



దిగువన వున్న వారికే ఆయా పథకాల ద్వారా లబ్ది చేకూరేలా వార్డు అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని అన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా డివిజన్ లలో పూడిక తో నిండిన కాలువల వివరాలు , మొక్కలు నాటడానికి అనువైన స్థలాలు గుర్తించి నివేదిక ఇవ్వాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హన్మంత రావు నాయక్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్.



గోదావరిఖని టౌన్, రిపోర్టర్– సురేష్, (శుభోదయం న్యూస్): రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ శుక్రవారం రోజున మానవతా దృక్పథంతో మరోసారి సేవా కార్యక్రమంలో ముందుండి నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. మక్కాన్ సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ గాజుల కిరణ్ నేతృత్వంలోని ప్రాంతంలో నివసిస్తున్న గురిశెట్టి శంకర్, శ్యామల దంపతుల నిరుపేద కుటుంబానికి ఉచితంగా నివాస గృహ నిర్మాణం చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి ఒక్కరికి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. ఇల్లు అనేది ప్రతి మనిషి హక్కు. మనతో పాటు ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలి అనే దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం అన్నారు. ఇంటి నిర్మాణ కార్యక్రమాన్ని మక్కాన్ సింగ్ సేవా సమితి.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సనియర్ నాయకులు తాజా మాజీ కార్పొరేటర్లు,సోషల్ మీడియా, వివిధ విభాగల అధ్యక్షులు తదితరులు ఉన్నారు



## దీన స్థితిలో నిరుపేద కుటుంబం..! అండగా నిలిచిన శ్రీ సీతారామ సేవా సమితి

**50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ, రూ. 2500 ఆర్థిక సహాయం అందజేత.**



రామగుండం మండలం, రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్): పాపం నిరుపేద కుటుంబాన్ని దేవుడు పగబట్టినట్టు ఉన్నాడు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు.. ఇంకోవైపు అనారోగ్య సమస్యలతో కుటుంబం పూట గడవని స్థితిలో తల్లడిల్లుతోంది. వివరాలు పెడితే గోదావరిఖని మార్కండే కాలనికీ చెందిన దుర్గం రాముకు రేణుక, బీటెక్ చదివే కూతురు ఆశ్రీత, టెన్త్ చదివిన కొడుకు వంశీకృష్ణ ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పూర్తిచేసిన రాముకు రెండేళ్ల క్రితం పక్షవాతం తో పాటు కిడ్నీ సంబంధిత సమస్యలు రావడంతో మంచానికి పరిమితమయ్యాడు. దీంతో కుటుంబం నడవడం కష్టం కావడంతో భార్య ప్రైవేట్ ఆస్పత్రిలో స్వీపర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. తల్లికి తోడుగా ఉండేందుకు బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కూతురు ఆశ్రీత, ఉదయం సాయంత్రం రోడ్లపై రాగి జావా విక్రయిస్తోంది. అలాగే టెన్త్ పూర్తి చేసిన కొడుకు వంశీకృష్ణ కూడా ఉదయం న్యూస్ పేపర్ వేస్తూ తల్లికి తోడుగా ఉంటున్నాడు. ఒకవైపు రాముకు ప్రతినెల వైద్యం అందించడానికి డబ్బులు సమకూర్చడానికి ఇబ్బంది పడుతూనే, ఇంకో దిక్కు కూతురు, కొడుకు చదువులకు డబ్బులు లేక ఆ తల్లి తల్లడిల్లుతోంది. విషయం తెలిసిన ఎన్టిపిసి లోని శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు స్పందించారు. శుక్రవారం ఈ నిరుపేద కుటుంబాన్ని శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు నేరుగా కలుసుకొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. 50 కిలోల బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులతో పాటు రూ.2,500 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాన్నీ ఆదుకునేందుకు మానవతా హృదయాలు ముందుకు రావాలని కోరారు. పిల్లల చదువు బాధ్యతలు స్వీకరించడంతోపాటు కుటుంబం పోషణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడానికి పలువురు స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచంద సంస్థల ఐక్య వేదిక తరుపున ఫైట్ ఫర్ బెస్ట్ సొసైటీ ప్రతినిధులు మద్దెల దినేష్, ప్రతినిధులు కంది సుజాత, జనగాం రాజేశ్వరి, లెనిన్, గౌస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వెడల్పులో భాగంగా బస్టాండ్ సమీపంలో మూడంతస్తుల భవనం కూల్చివేత



రామగుండం మండలం రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్): హైకోర్టు లో స్టేటస్ కో ఉండగానే తన మూడంతస్తుల భవనాన్ని కూల్చివేయడం సరైన విధానం కాదని యజమాని గాజుల రాయమల్లు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని మూడంతస్తుల భవనాన్ని రోడ్డు వెడల్పులో భాగంగా రామగుండం బల్దియా అధికారులు కూల్చివేతకు శ్రీకారం చుట్టారు. అయితే యజమాని మాట్లాడుతూ హైకోర్టులో ఉన్న స్టేటస్ కో పెద్దదా...లేదా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



చెప్పినదే ముఖ్యమా యాజమాని అని ప్రశ్నించారు. గత ఏడాది కాలం నుంచి కూల్చివేతల విషయంలో తమ భవనం హైకోర్టులో కేసు కొనసాగుతుందన్నారు. ఈనెల 21 వరకు తమకు అవకాశం ఉన్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసుకుని, బలవంతంగా భవనాన్ని కూల్చివేయడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు భవనం యజమానికి పోలీసులకు మధ్య వాగ్వివాదం జరగడంతో బలవంతంగా గాజుల రాయమల్లు ను పోలీసులు లాక్కొని వాహనంలో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. రోడ్డు వెడల్పుల భాగంగా పక్కనే ఉన్న వారికి కొంత మేరకు షాపులు నిర్వహించేందుకు అవకాశం ఇస్తామని సింగరేణి సంస్థ, మరోవైపు రామగుండం కార్పోరేషన్ హామి ఇవ్వడంతో వ్యాపారులు కొందరు ఒప్పుకున్నారు. దీంతో బస్టాండ్ సమీపంలో 40 ఏళ్ల నుంచి ఉన్న వ్యాపారాలు నేలమట్టమయ్యాయి.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో ఎన్ ఆర్ ఇ జి ఎస్ 4 లక్షల రూపాయలు సీసీ రోడ్డు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిన శంకర్, పాక్స్ వైస్ చైర్మన్ దొంతురం గంగారం, బోయిని పెద్ద హన్మండ్లు, లక్ష్మీనారాయణ, దొంతురం కాశిరం, హైమద్, పాపయ్య, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బాలానగర్ నూతన ఏసీపీ ని కలిసిన హెచ్.ఏ.ల్ ఐ.యన్.టి.యు.సి యూనియన్ నాయకులు




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), మే 16: బాలానగర్ నూతన ఏసీపీ గా భాధ్యతలు చేపట్టిన నరేష్ రెడ్డి గారిని ఏసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్కనాగరాజు ఆధ్వర్యంలో వారికి శాలువాతో సత్కరించి పూల బోకె తో శుభాకాంక్షలు తెలియజేసారు.ఏసీపీ గారు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయం లో ముక్కుసూటి గా పనిచేస్తానని అందరు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఏ.ల్ ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు మహమ్మద్ సిబ్గాతుల్లాహ్, హెచ్ఎడభ్యు జాయింట్ సెక్రెటరీస్ డి.వెంకటపతి,నాగార్జున,ఆర్గనైసింగ్ సెక్రటరీ అబ్దుస్ షుకూర్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి కూలీలకు 8 వారాల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఉపాధ్య క్షులు అజయ్

అ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు 8 వారాలుగా కూలీ డబ్బులు ఇవ్వకపోవడం దారుణమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ అన్నారు. శుక్రవారం అమరచింత మండలం ధర్మపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి. సమస్య లతో కూడిన కరపత్రాలు పంపిణి చేస్తూ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలకు 8 వారాలైనా కూలీ డబ్బులు రాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి కూలీ డబ్బులు రాక కార్మికులు ఆవేదన చెందుతున్నారనీ ఆరోపించారు.అనేక పోరాటాల వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పనిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని పని ప్రదేశాలలో వాటర్ టెంట్ మెడికల్ కిట్టు ఓఆర్ఎస్ పాకెట్లు కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని పనిచేసిన కూలిలకు 100, 150 రూపాయలు మాత్రమే పడుతున్నాయని వెంటనే 8 వారాల కూలీ డబ్బులు విడుదల చేయాలని లేనియెడల కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారుపని ప్రదేశం లో రోజు కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ లు అందిచడం లేదని ఆరోపించారు. అదేవిదంగా ప్రతి వారం చేసిన పనులకు పే స్లిప్పులు ఎందుకు ఇవ్వడం లేదని ఎంపీడీవో, ఏపీవో లను ప్రశ్నించారు. కొలతల పేరుతొ తక్కువ కూలి లు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని. ప్రస్తుతం వున్న జాబ్ కార్డుల్లో కొత్త పేర్లు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సంఘం మండలఅధ్యక్షులు కె .శంకర్. కూలీలు ఆశిరెడ్డి చెన్నప్ప మాధవి సత్యమ్మ పార్వతమ్మ. రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ విజృంభిస్తున్న కొవిడ్

: హాంకాంగ్, సింగపూర్లో మళ్లీ కొవిడ్ విజృంభిస్తోంది. కొవిడ్తో పాటు అడినోవైరస్, రైనో వైరస్ వ్యాప్తి చెందుతున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. హాంకాంగ్ 13, 17 నెలల చిన్నారులకు వైరస్ సోకినట్లు గుర్తించారు. ఈనెల 3న తొలి కేసు నిర్ధారణ కాగా, వారంలోనే వేలల్లో కేసులు నమోదవుతున్నాయి. సింగపూర్లో వారంలో 14,200కు కేసులు పెరిగాయి. సింగపూర్, హాంకాంగ్లో మళ్లీ మాస్క్ తప్పనిసరి చేశారు.ఆడపిల్ల పుట్టిందని పసికందు గొంతు కోసి హత్య చేసిన తండ్రి

## ఆడపిల్ల పుట్టిందని పసికందు గొంతు కోసి హత్య చేసిన తండ్రి

**హైదరాబాద్ గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నేపాల్ నుండి వచ్చి ఒక అపార్టుమెంటులో వాచ్ మెన్గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్న జగత్ విశ్వకర్మ, గౌరీ అనే దంపతులు వీరికి ఒక కొడుకు, కూతురు ఉండగా, అనారోగ్యంతో కొడుకు మృతి14 రోజుల క్రితం గౌరీకి ఆడపిల్ల జన్మించగా, ఆడపిల్ల పుట్టిందనే కోపంతో తల్లి పొత్తిళ్ళలో నిద్రిస్తున్న పసికందును బయటకు తీసుకువెళ్లి కత్తితో గొంతుకోసి మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టి పెట్టిన తండ్రి ఒక గంట తరువాత నిద్ర లేచిన గౌరి పాప ఎక్కడని నిలదీయగా, చంపేసి గోనె సంచిలో పెట్టానని చెప్పిన జగత్ దీంతో గౌరీ సమీపంలో ఉన్న పరిచయస్తులకు సమాచారం ఇచ్చేందుకు బయటకు వెళ్లిన సమయంలో, ృతదేహాన్ని చెత్తకుప్పలో పడేసిన తండ్రి గౌరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, జగత్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

## తెలంగాణ రైతులకు అలర్ట్.. ఈనెల 23వ తర్వాత రైతు భరోసా..!!

తెలంగాణ రాష్ట్ర రైతన్నలకు అలర్ట్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పై కీలక అప్డేట్ వచ్చింది. ఈనెల 23 తర్వాత రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులు వేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.గతంలో చాలావరకు రైతు భరోసా డబ్బుల పెండింగ్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే పెండింగ్ లో ఉన్న రైతు భరోసా సహాయాన్ని ఈనెల 23 తర్వాత జమ చేసేందుకు రంగం సిద్ధం చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ఇప్పటివరకు మూడున్నర ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇక ఈ నెల 23వ తేదీ తర్వాత నాలుగు ఎకరాలు, ఆపైన ఉన్నవారికి కూడా నగదు జమ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇక ఈ రైతుబంధు కింద రెండు విడతల్లో 6000 రూపాయల చొప్పున 12000 ఇస్తున్నారు.

## బాలానగర్ నూతన ఏసీపీ ని కలిసిన హెచ్.ఏ.ల్ ఐ.యన్.టి.యు.సి యూనియన్ నాయకులు


బాలానగర్ నూతన ఏసీపీ గా భాధ్యతలు చేపట్టిన నరేష్ రెడ్డి గారిని ఏసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్కనాగరాజు ఆధ్వర్యంలో వారికి శాలువాతో సత్కరించి పూల బోకె తో శుభాకాంక్షలు తెలియజేసారు.ఏసీపీ గారు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయం లో ముక్కుసూటి గా పనిచేస్తానని అందరు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఏ.ల్ ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు మహమ్మద్ సిబ్గాతుల్లాహ్, హెచ్ఎడభ్యు జాయింట్ సెక్రెటరీస్ డి.వెంకటపతి,నాగార్జున,ఆర్గనైసింగ్ సెక్రటరీ అబ్దుస్ షుకూర్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

### వినూత్న ఆలోచనలతో వ్యాపార రంగంలో రానించవచ్చు..!!

## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అర్ధ. సుధాకర్ రెడ్డి.!!

: వికారాబాద్ మున్సిపల్ లోని గాంధీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రోజీ మెలోడీ డబ్బింగ్ స్టూడియో ను ప్రారంభించిన వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్ధ. సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా స్టూడియో నిర్వాహకురాలు రోజీ సరళ అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, సురేష్ హీరేకర్, మురళి, మాజీ జడ్పీటీసీ ముత్తార్ షరీఫ్, టీపీసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కాపు మధుకర్, యువనాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, రహీం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాక్‌కి షాక్ ఇవ్వనున్న భారత్.. సింధు నదులపై కాలువలు, ప్రాజెక్టులకు శ్రీకారం..



**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ "సింధు జలాల ఒప్పందాన్ని" నిలిపేసింది. 26 మందిని బలి తీసుకున్న ఈ ఉగ్ర ఘటనకు పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాదులు పాల్పడినట్లు తేలింది. పాకిస్తాన్ దేశంలో 80 శాతం మంది ప్రజలకు ఈ సింధు నది, దాని ఉపనదుల జలాలే జీవనాధారం. ప్రస్తుతం, ఈ ఒప్పందాన్ని నిలిపేయవద్దని పాకిస్తాన్ భారత్‌ని కోరుతోంది. ఇదిలా ఉంటే, భారత్ మాత్రం పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చినంత కాలం ఈ ఒప్పందం నిలిచే ఉంటుందని స్పష్టం చేసింది. తాజాగా, సింధు నది జలాల విషయంలో భారత్ దాయాదికి మరో షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, సింధు జలాలను సమర్థవంతంగా వాడుకోవాలని భారత్ భావిస్తోంది. పాకిస్తాన్ పంటలకు నీటిని అందించే ప్రధాన నది నుంచి నీటిని మళ్లించే ప్రణాళికల్ని భారత్ పరిశీలిస్తోంది. భారత్ గుండా పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు వెళ్లే చీనాబ్ పై ఉన్న రణబీర్ కాలువ పొడవును 120 కి.మీకి రెట్టింపు చేయాలని చూస్తోంది. ఈ ఒప్పందంపై సంతకం చేయడానికి ముందే అంటే, 1960కి ముందే ఈ కాలువ నిర్మించబడింది. భారత్ చీనాబ్ నది నుంచి పరిమిత మొత్తంలో నీటిని తీసుకోవడానికి అనుమతి ఉంది. కాలువ విస్తరణకు సంవత్సరాలు పట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది సెకన్‌కి 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఇది 40 క్యూబిక్ మీటర్లుగా ఉంది. రణబీర్ కాలువ విస్తరించడంపై ప్రభుత్వం చర్చిస్తున్నట్లు ప్రస్తుతానికి నివేదించబడలేదు. కాలువను విస్తరించడంతో పాటు, ఆ దేశానికి కేటాయించిన సింధు, చీనాబ్, జీలం నుంచి నీటిని మెరుగ్గా వాడుకునేందుకు భారత్ సిద్ధమైంది. ఈ నీటిని ఉత్తర భారత రాష్ట్రాలతకు తరలించే అవకాశాన్ని భారత్ పరిశీలిస్తోందని రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. కొత్తగా ఈ ఐదు రిజర్వాయర్ ప్రాజెక్టుల్ని భారత్ గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం నదులపై ఉన్నట్లు తెలిపింది. ఇటీవల, ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని, సింధు జలాల ఒప్పందాన్ని ఉద్దేశిస్తూ, "నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు" అని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నంత కాలం ఒప్పందాన్ని భారత్ నిలిపి ఉంచుతుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందాన్ని నిలిపేయడం చట్టవిరుద్ధమని వాదిస్తూ, భారత్‌కి లేఖ రాశారు. అయితే, ప్రస్తుతం సింధు నది వ్యవస్థ నుంచి భారత్ గణనీయమైన మొత్తంలో నీటిని నిలిపేయడం లేదా మళ్లించడం కోసం ఆనకట్టలు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలను నిర్మించడానికి భారతదేశానికి సంవత్సరాలు పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, పాకిస్తాన్‌కి వెళ్లే కొద్ది మొత్తాన్ని అడ్డుకున్నా కూడా ఆ దేశంలోని వ్యవసాయం అస్తవ్యస్తం అవుతుందని చెబుతున్నారు.

## వంశీ ఆరోగ్యం అసలు బాగోలేదు: భార్య పంకజశ్రీ




ఏలూరు జిల్లా: తన భర్త ఆరోగ్యం అసలు బాగోలేదని వల్లభనేని వంశీ భార్య పంకజశ్రీ అన్నారు. కిటోన్ శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చాయని తెలిపారు. బరువు కూడా తగ్గిపోయారని.. వంశీ ఆరోగ్యంపై తమకు తీవ్ర ఆందోళనగా ఉందని తెలిపారు. లాయర్ చిరంజీవి మాట్లాడుతూ.. వంశీపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని.. పాత కేసులను తిరగదోడి కావాలనే ఇబ్బందిపెడుతున్నారన్నారు. పిటీ వారెంట్ దాఖలులో నిబంధనలు ఫాలో కాలేదని చిరంజీవి అన్నారు వల్లభనేని వంశీకి నూజివీడు కోర్టు.. 14 రోజుల రిమాండ్‌ను విధించింది. హనుమాన్ జంక్షన్ పోలీసుల పీటీ వారెంట్‌తో వంశీకి రిమాండ్ విధించింది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై అక్రమ కేసులతో అధికార కూటమి ప్రభుత్వం వేధింపుల పరంపరను కొనసాగిస్తోంది. ఇప్పటికే ఆయనపై పలు అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయటంతో గత 90 రోజులకుపైగా వంశీ విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇప్పటి వరకు ఆయనను అరెస్ట్ చేసిన కేసుల్లో న్యాయస్థానం వరుసగా బెయిల్ మంజూరు చేయటంతో తాజాగా హనుమాన్‌జంక్షన్ పోలీసులు నూజివీడు కోర్టులో గురువారం పీటీ వారంట్ దాఖలు చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో వంశీపై నమోదైన పాత కేసును ఇప్పుడు తెర మీదకు తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే వల్లభనేని వంశీ శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు కొండ సురేఖ.. థ్యాంక్స్ చెప్పిన కెటిఆర్



హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండ సురేఖ వివాదంలో చిక్కుకున్నారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అరవిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె డబ్బులు తీసుకోకుండా మంత్రులు ఏ పని చేయరూ అంటు వ్యాఖ్యానించారు. 'మా దగ్గరకు చాలా ఫైల్స్ వస్తుంటాయి. చాలా మంది మంత్రులు డబ్బులు తీసుకొనే ఫైల్స్ క్లియర్ చేస్తుంటారు. కానీ, నేను అలా చేయను. సమాజ సేవే చేస్తుంటాను. నాకు నయా పైస అక్కర్లేదు. స్కూల్ డెవలంప్‌మెంట్ చేయమన్నాను' అని సురేఖ అన్నారు. దీంతో ఇది చాలా వివాదాస్పదమైంది. దీనిపై ఆమె తాజాగా వివరణ ఇచ్చారు. బిఆర్ఎస్‌లో ఉండే మంత్రుల గురించి తాను మాట్లాడానని.. అలా తప్పుడు ప్రచారం చేయడం తప్పు అని ఆమె పేర్కొన్నారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకొనే వారని అన్నారు. అయితే కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కెటిఆర్ థ్యాంక్స్ చెప్పారు. మొత్తానికి కొండ సురేఖ నిజాలు బయట పెట్టారని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కమీషన్ సర్కార్ నడుపుతోందని కెటిఆర్ పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ సింధూర్' ద్వారా నయా భారత్ అంటే ఏంటో తెలిసింది



భుజ్: గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత ఆయన తొలిసారిగా అక్కడకు వెళ్లారు. అక్కడ ఆర్మీ, వాయుసేన, బీఎస్ఎఫ్ సిబ్బందితో రాజ్‌నాథ్ ముచ్చటించారు. ఈ పర్యటనలో రాజ్‌నాథ్‌తో పాటు ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఎ.పి. సింగ్ ఉన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో వాయుసేన ప్రధానపాత్ర వహించిందని ఆయన అన్నారు. ఎయిర్‌ఫోర్స్ ఎంతో ధైర్యం పరాక్రమం ప్రదర్శించిందని కొనియాడారు. కేవలం 23 నిమిషాల్లోనే ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వం ఉగ్రవాదులకు నూతన సందేశం ఇచ్చిందని తెలిపారు. భారత వాయుసేన స్థావరాలను పాక్ డ్రోన్లు ఏమీ చేయలేకపోయాయని.. బ్రహ్మోస్ క్షిపణి సత్తాకు పాక్ తలవంచక తప్పలేదని అన్నారు. "మన అత్యాధునిక ఆయుధాలు అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్లాయి. ఆపరేషన్ సింధూర్‌తో మన సత్తా ప్రపంచమంతా చూసింది. పాకిస్థాన్‌కు ఆర్థికసాయం చేస్తే ఉగ్రవాదులకు చేసినట్లే. పాక్‌కు ఆర్థికసాయంపై ఐఎంఎఫ్ పునరాలోచించుకోవాలి. ఉగ్రవాదులకు పాక్ సాయం చేస్తూ ప్రపంచానికి ముప్పు కలిగిస్తోంది. శాంతికి విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని ఆపరేషన్ సింధూర్ ద్వారా నిరూపించాం. పాక్‌లోని ఏ ప్రాంతపైనైనా దాడి చేయగల సామర్థ్యం భారత్‌కు ఉంది. ఆపరేషన్ సింధూర్ ద్వారా 'నయా భారత్' అంటే ఏంటని ప్రపంచానికి తెలిసింది" అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

# 'సుప్రీం'కు న్యాయ మీమాంస



శాసనసభలు ఆమోదించి పంపే బిల్లులపై రాష్ట్రపతి లేదా గవర్నర్లు నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్ణ యాన్ని ప్రకటించాలనీ, లేనట్టయితే వాటిని ఆమోదించినట్టుగా భావించవచ్చని గత నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి కోర్టు మెట్లెక్కింది. ఈ తీర్పుపై కేంద్రప్రభుత్వం తాజాగా రాష్ట్రపతి ద్వారా సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరింది. నిజానికి, ఆ తీర్పు ఇటీవల రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ దానిపై విరుచుకు పడ్డారు. 'ఈమధ్య ఒక తీర్పు ఏకంగా రాష్ట్రపతికే ఆదేశాలు జారీచేసింది. జడ్జీలే సూపర్ పార్లమెంటుగా వ్యవహరిస్తు న్నారు. ప్రజాస్వామ్య శక్తులే లక్ష్యంగా దాడి జరుగుతోంది' అంటూ విమర్శించారు. కీలకాంశాలపై రాజ్యాంగ న్యాయస్థానాలు వెలువరించే అసాధారణ తీర్పులు ఒక్కోసారి అసాధారణ పరిణా మాలకు దారి తీస్తాయి. తమ శాసనసభ ఆమోదించి పంపిన బిల్లుల్ని గవర్నర్ ఆర్.ఎన్. రవి ఎటూ తేల్చకుండా దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ఇద్దరు న్యాయ మూర్తుల ధర్మాసనం ఈ సంచలన తీర్పు వెలువరించింది. అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లులు నెలల తరబడి, ఏళ్ల తరబడి గవర్నర్ల వద్ద పెండింగ్‌లో వుండిపోవటం తమిళనాడు సమస్య మాత్రమే కాదు... విపక్షాల ఏలుబడిలో వున్న కొన్ని ఇతర ప్రభుత్వాల పరిస్థితి సైతం ఇలాగేవుంది. భిన్న సందర్భాల్లో సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేస్తూనే వచ్చింది. విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడివున్న అంశాల్లో వివరణ కోరడానికీ లేదా సందేహ నివృత్తికీ, రాష్ట్రాలమధ్య తలెత్తే వివాదాల్లో అభిప్రాయం కోరడానికీ 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' రూపంలో కేంద్రప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం ముందు వ్యాజ్యం దాఖలు చేస్తుంది. రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద వున్న ఈ అధికారాన్ని అరుదైన సందర్భాల్లో మాత్రమే కేంద్రం వినియోగించుకుంటుంది. ఈ తీర్పుద్వారా సుప్రీంకోర్టు తన అధికార పరిధిని దాటిందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ నివేదనలో 14 ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులు తమ పరిశీలన కొచ్చినప్పుడు రాష్ట్రపతి లేదా గవర్నర్లు ఏం చేయాలో రాజ్యాంగంలోని 200, 201 అధికరణలు నిర్దేశిస్తున్నాయి. వాటిననుసరించి బిల్లుల్ని ఆమోదించే లేదా తోసిపుచ్చే అధికారం వుంటుంది. 200 అధికరణ ప్రకారం బిల్లు గవర్నర్ పరిశీలనకొచ్చినప్పుడు 'సాధ్యమైనంత త్వరగా' దానిపై అభిప్రా యాన్ని ప్రకటించాలంటున్నది. దాన్ని నిరాకరించాక తిరిగి అదే రూపంలో రెండోసారి బిల్లు వచ్చిన ప్పుడు గవర్నర్ తన ఆమోదాన్ని పెండింగ్‌లో వుంచరాదని చెబుతోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినపక్షంలో ఏం చేయాలో 201 అధికరణ సూచిస్తోంది. ఆమో దానికి లేదా తిరస్కారానికీ అందులో నిర్దిష్టమైన వ్యవధిని సూచించటం లేదన్నది 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' ప్రస్తావిస్తోంది. అలాంటప్పుడు గవర్నర్లయినా, రాష్ట్రపతైనా మూణ్ణెల్లలోగా బిల్లులపై తమ నిర్ణయం ప్రకటించాలని, లేనట్టయితే వాటిని ఆమోదించినట్టే భావించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తుందని ప్రశ్నిస్తోంది. పైగా ఇలాంటి ఆదేశాలు రాజ్యాంగ ధర్మాసనం ఇవ్వాలి తప్ప ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఇవ్వొచ్చునా అనే సందేహాన్నీ వ్యక్తం చేసింది. మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని ఒక దార్శనిక పత్రంగా రూపొందించారు తప్ప మనల్ని మనం ఎలా పరిపాలించుకోవాలో... దేన్ని ఏవిధంగా ఆచరించాలో సూచించే నిబంధనల పత్రంగా తయారుచేయలేదు. కనుకనే ఆచరణలో ఎదురయ్యే సమస్యల్ని దృష్టిలో వుంచుకుని దానికి భాష్యం చెప్పుకోవటం, సవరించుకోవటం తప్పటం లేదు. మన కార్యనిర్వాహక వ్యవస్థ ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో రాజ్యాంగానికి వందకుపైగా సవరణలు తీసుకురావాల్సి వచ్చిందంటేనే ఆసంగతి తెలుస్తోంది. ఇక సర్వోన్నత న్యాయస్థానం భిన్న సందర్భాల్లో వెలువరించిన తీర్పుల ద్వారా వివిధ అధికరణల విస్తృతిని పెంచింది. వీటన్నిటికీ రాజ్యాంగస్ఫూర్తే గీటురాయి. మన దేశంలో పటి ష్ఠమైన సహకార సమాఖ్య వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం ఆశించింది. కేంద్ర ప్రతినిధులుగా రాష్ట్రాల్లో గవర్నర్లు ఏం చేయాలో, రాష్ట్రపతి ఎలా వ్యవహరించాలో రాజ్యాంగంలోని అధికరణలు చెబుతున్నాయి. తమ ఆచరణ దేశంలో సహకార సమాఖ్య వ్యవస్థ పరిఢవిల్లాలని చెప్పే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉంటున్నదో లేదో పరిశీలించుకోవాల్సిన అవసరం గవర్నర్లకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ఒక చర్యకు ఉపక్రమించినప్పుడు దాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవటం ఏ రకంగా సబబవుతుంది?ఇందువల్ల కేవలం ఒక రాజకీయపక్షం ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని పనిచేయకుండా నిరోధించటం మాత్రమే కాదు... ప్రజలిచ్చిన రాజకీయ అధికారాన్ని గుర్తించ నిరాకరించటం కూడా! ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా రాజ్యాంగ పరిధిని దాటి, మందబలంతో దేశ భద్రతకు ముప్పు కలిగించే నిర్ణయాలు తీసుకుంటే వాటిని ఆపడాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ప్రజాహితం, వారి సంక్షేమం, భద్రత కోరి చేసే బిల్లుల్ని కూడా పెండింగ్‌లో వుంచటం ఏం సబబు? గవర్నర్లు తమవద్దకొచ్చే బిల్లుల్ని అకార ణంగా పెండింగ్‌లో వుంచటం సారాంశంలో రాజకీయ సమస్య. కనీసం దీన్ని గవర్నర్లవరకూ పరి మితం చేసి రాష్ట్రపతి ప్రమేయాన్ని నివారించి వుంటే బాగుండేది. కానీ రాష్ట్రపతి దగ్గర సైతం బిల్లులు పెండింగ్‌లో పడటం వల్ల సమస్య మరింత జటిలమైంది. తాజా నివేదనను పరిశీలించబోయే రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయంలో ఏం చెబుతుందో వేచిచూడాలి.


# ట్రోలర్లపై చర్యలేవి?




విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రితో పాటు ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఆన్‌లైన్ దాడులు మన దేశ డిజిటల్ వాతావరణంలో పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి నిదర్శనం. స్వాతి చతుర్వేది తన పుస్తకం 'ఐ యామ్ ఏ ట్రోల్' (నేనొక అంతర్జాల పోకిరిని)లో "భారతదేశంలో సోషల్ మీడియా మితవాద ట్రోలర్స్‌తో నిండిపోయింది. వారు ఆన్‌లైన్‌లో మత విద్వేషాన్ని రెచ్చగొడతారు, జర్నలిస్టులను, ప్రతిపక్ష రాజకీయ నాయకులను దుర్భాషలాడతారు, లైంగికంగా వేధిస్తారు.' అని పేర్కొన్నారు. ఈ విషపూరిత సంస్కృతి గతంలో ప్రముఖులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేది. ఇప్పుడు వారి కుటుంబ సభ్యులను, అలాగే జాతీయ విషాద ఘటనల్లో బాధితుల కుటుంబాలను కూడా వదిలిపెట్టకపోవడం గమనార్హం. విదేశాంగ కార్యదర్శిగా ఉన్న విక్రమ్ మిస్రి పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్‌ల మధ్య కాల్పుల పర్వం ప్రారంభమైనప్పటి నుండి జరిగిన మీడియా సమావేశాల్లో మరో ఇద్దరు సైనికాధికారులతో కలిసి భారత ప్రభుత్వ వాణిని వినిపించేవారు. ఈ క్రమంలో భాగంగానే కాల్పుల విరమణ గురించి ప్రకటనను భారత ప్రభుత్వం తరపున ఆయన చేశారు. దీంతో ట్రోలర్స్ ఆయన్ను, ఆయన కుమార్తెను లక్ష్యంగా చేసుకున్నారు. రాయలేని భాషల్లో సోషల్ మీడియాలో దూషించారు. మిస్రి కుమార్తె వ్యక్తిగత వివరాలు బయటపెట్టడంతోపాటు, ఆమె దేశభక్తిని ప్రశ్నించారు. ఈ దాడితో వారు తమ సోషల్ మీడియా ఖాతాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఈ వేధింపులు అధికారుల కుటుంబాలకూ పరిమితం కాదు. ఉగ్రవాద దాడుల బాధిత కుటుంబాలు, ఇతర బాధితుల కుటుంబాలు కూడా ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులకు గురయ్యాయి. పహల్గాం ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన లెఫ్టినెంట్ వినరు నర్వాల్ భార్య హిమాంషి నర్వాల్ కూడా ట్రోల్స్ బారిన పడ్డారు. ఈ సంఘటనలో కాశ్మీరీలను, ముస్లింలను లక్ష్యంగా చేసుకోవద్దని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరడమే ఆమె చేసిన నేరం! ఉగ్రవాదుల కాల్పుల్లో తండ్రిని కోల్పోయిన ఒక యువతి కాశ్మీర్‌లో తనకు ఇద్దరు సోదరులు లభించారంటూ చేసిన వ్యాఖ్యలు కూడా ట్రోలింగ్‌కు గురయ్యాయి. సమాజం నుండి మద్దతు, సానుభూతి లభించాల్సిన సమయంలో వీరంతా నిందలకు, వేధింపులకు గురికావడం బాధాకరం. గాయకుడు సోనూ నిగమ్, బాలీవుడ్ నటుటు భూమి పెడ్నేకర్, ఆలియా భట్ తదితరులు కూడా తదితరులు కూడా ఇటీవల ట్రోలింగ్ బారిన పడ్డారు. అధికార పార్టీకి చెందిన మంత్రులపైనో, నాయకులపైనో సోషల్ మీడియాలో విమర్శలు పెట్టీ పెట్టగానే రకరకాల కేసులతో చెలరేగిపోయే ప్రభుత్వ యంత్రాంగం ఈ అన్ని సందర్భాల్లోనూ మౌనం వహించడం, నామమాత్రంగా కూడా స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ కుమార్తె గతంలో రోహింగ్యా శరణార్థుల కోసం పనిచేయడమే మితవాద ట్రోలర్స్ ఆగ్రహానికి కారణమని చెబుతున్నారు. ఈ కారణంగానే అత్యున్నత స్థాయి అధికారైనప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందన్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. అత్యున్నత స్థాయి వ్యక్తులకే ఈ పరిస్థితి తప్పనప్పుడు సామాన్యుల సంగతేమిటన్న ప్రశ్నకు జవాబు లభించడం కష్టం. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2024లో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 66,854 సైబర్ వేధింపుల కేసులు నమోదయ్యాయి. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక కేసు నమోదైనట్లు చెబుతున్నారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా ఈ తరహా కేసులు భారీగా పెరిగే అవకాశముందని అంచనా! 'ట్రోలర్స్ యాదృచ్ఛిక వ్యక్తులు కారు. వీరిలో చాలామంది వ్యవస్థీకత డిజిటల్ ఆర్మీలో భాగంగా ఉంటారు.

వారి ఆన్‌లైన్ దాడులకు ప్రోత్సాహం, కొందరికి బహుమతులు కూడా లభిస్తాయి," అని చతుర్వేది రాశారు. "ట్రోలింగ్ అనేది ఉద్దేశపూర్వకమైన, వ్యవస్థీకత చర్య. మౌనంగా ఉండేలా చేయడం, బెదిరించడం, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడం' వీరి లక్ష్యమని సుదీర్ఘ పరిశోధన తరువాత ఆమె నిర్ధారించారు. ఈ తరహా వైఖరి పౌర హక్కులకు, ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని కలుగ చేస్తుంది. వాటిని రక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కఠినచర్యలు తీసుకోవాలి. బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలి.

# ఆవిష్కరణల కాంతిలో విశ్వమానవ ప్రగతి




తూర్పున ఉదయించే కాంతి రేఖలు మనకు ప్రతీ రోజూ నవశకానికి స్వాగతం పలుకుతుంది. తూర్పు దిక్కున అరుణారుణ కాంతులు మెల్లగా వ్యాపిస్తుంటే, అది కేవలం ప్రకృతి రమణీయమైన దృశ్యం మాత్రమే కాదుబీ మానవజాతి అనంతమైన ప్రగతి పథానికి అది శుభసూచకం. కాంతి కేవలం ఒక భౌతిక దృగ్విషయం మాత్రమే కాదు. ఇది నూతన ఆలోచనలకు, ఊహలకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఊపిరినిచ్చే ఒక అక్షయ శక్తి. కాంతి, ఈ విశ్వంలోని ప్రాథమిక శక్తి, కేవలం మన కంటికి గోచరించే ప్రకాశం కాదు. ఇది శాస్త్ర, సాంకేతిక, వైద్య, వ్యవసాయ, సమాచార, పర్యావరణ రంగాలలో ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, పేదరికం, అసమానత్వం, ఆహార కొరత, వాతావరణ మార్పు వంటి పెను సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కాంతి ఆధారిత సాంకేతికతలు ఒక దిక్సూచిలా, ఒక ఆశాకిరణంలా పని చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మే 16న జరుపుకునే అంతర్జాతీయ కాంతి దినోత్సవం మన జీవితాల్లో కాంతి ప్రాముఖ్యతను మరింత లోతుగా గుర్తుచేస్తుంది. 2025వ సంవత్సరం థీమ్ అయిన 'కాంతి, ఆవిష్కరణ, సమాజం' అనేది ఈ ప్రాముఖ్యతను మరింతగా విశదీకరిస్తుంది. కాంతి బహుముఖ ప్రజ్ఞను మన ముందుంచుతుంది. ఈ థీమ్ శాస్త్రీయ పరిశోధనల పురోగతి, సాంకేతిక ఆవిష్కరణల విశిష్టత, సమాజ సమగ్ర శ్రేయస్సును పెంపొందించడంలో కాంతి ఆధారిత సాంకేతికతల అనితరసాధ్యమైన పాత్రను నొక్కి చెబుతుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన ప్రజలను %-% శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను కాంతి శాస్త్రం, సాంకేతికత యునెస్కో లక్ష్యాలైన శాంతి, సమానత్వం, విద్యను ఎలా సాధించగలదో తెలిపే విభిన్న కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనమని స్ఫూర్తినిస్తుంది, ప్రోత్సహిస్తుంది. కేవలం ఒక శతాబ్దం క్రితం ఊహించలేని లేజర్ల ఆవిష్కరణ నుండి నేటి అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీల వరకు, కాంతి శాస్త్రం మానవ మేధస్సు అద్భుతమైన విజయాలకు, పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ క్వాంటమ్ సైన్స్, టెక్నాలజీ సంవత్సరంతో కూడా అనుసంధానించబడి ఉండటం, ఈ అంశం సమకాలీన ప్రాముఖ్యతను మరింతగా చాటుతోంది. నేడు మానవ సమాజం అనేక సంక్లిష్టమైన, అంతర్లీన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల తీవ్రపరిణామాలు, ఆరోగ్య సంరక్షణలో అంతరాలు అసమానతలు, ప్రపంచవ్యాప్తంగా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడంలో ఉన్న అవరోధాలు కొన్ని ముఖ్యమైనవి. ఈ క్లిష్టమైన సవాళ్లను సమర్థవంతంగా స్థిరంగా అధిగమించడానికి కాంతి ఆధారిత ఆవిష్కరణలు ఒక శక్తివంతమైన సాధనంగా, ఒక ఆశాజనకమైన మార్గంగా ఆవిర్భవిస్తున్నాయి. శక్తిని మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేయడానికి వినియోగించడానికి నూతన, పర్యావరణ అనుకూల లైటింగ్ టెక్నాలజీలు నిరంతరం అభివృద్ధి చేయబడుతున్నాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి ప్రాథమిక రంగాలలో కాంతి ఆధారిత సాంకేతికతల అనువర్తనాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ రంగంలో 'అగ్రి-ఫోటోనిక్స్' ద్వారా పంటల దిగుబడిని గణనీయంగా పెంచడం, నీటి వినియోగాన్ని హేతుబద్ధీకరించడం, హానికరమైన తెగుళ్ళను పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నియంత్రించడం సాధ్యమవుతోంది. వైద్య రంగంలో, మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అత్యాధునిక ఇమేజింగ్ టెక్నిక్‌లు కచ్చితమైన లేజర్ ఆధారిత చికిత్సా విధానాలు వ్యాధులను మరింత ముందుగా మరింత కచ్చితంగా గుర్తించడానికి సమర్థవంతంగా నయం చేయడానికి సహాయపడుతున్నాయి. ఇది రోగుల వేగవంతమైన పునరుద్ధరణకు దోహదం చేస్తోంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో, కాంతి వేగంతో అపారమైన సమాచారాన్ని క్షణాల్లో చేరవేసే ఆప్టికల్ ఫైబర్‌లు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా అనుసంధానిస్తున్నాయి. విద్యారంగంలో కాంతి ఆధారిత సాంకేతికతలు బోధనా పద్ధతులను మరింత ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా తద్వారా మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి. ఈ స్ఫూర్తిదాయకమైన అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా, కాంతి అపారమైన శక్తిని దాని ఆధారిత సాంకేతికతల విశిష్టమైన ప్రాముఖ్యతను మనమందరం గుర్తెరుగుదాం. ముఖ్యమైన ఆవిష్కరణలు కేవలం ఉన్నత స్థాయి శాస్త్రీయ ప్రయోగశాలలకు లేదా ప్రత్యేక పరిశోధనా సంస్థలకు మాత్రమే పరిమితం కాకూడదు. వాటి విస్తృత ప్రయోజనాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి వర్గానికి అందుబాటులోకి రావాలి. విద్య, ఆరోగ్య సంరక్షణ స్థిరమైన అభివృద్ధి వంటి కీలక రంగాలలో కాంతి ఆధారిత ఆవిష్కరణలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, మనం మరింత సమతా పూర్వకమైన, అభివృద్ధి చెందిన మానవీయ విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించగలము. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు విధాన రూపకర్తలు ఒక ఉమ్మడి లక్ష్యంతో కలిసి పనిచేసి, కాంతిని మరింత సమర్థవంతంగా, సృజనాత్మకంగా ఉపయోగించుకునే మార్గాలను అన్వేషిద్దాం. తద్వారా, మనం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించగలము. కాంతిని ఆవిష్కరణలకు మార్గదర్శకంగా, సమాజానికి వెలుగు దివ్వెగా నిలుపుదాం. ఈ కాంతి ప్రయాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలు, ప్రయత్నాలు భాగస్వామ్యం అమూల్యమైనవి. కలిసి సాగుదాం, కాంతివంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం.

శుభోదయం
సంపాదకీయం

# మిగిలిన ప్రశ్నలు ముగిసిన యుద్ధం,

'మన తోబుట్టువుల, కుమార్తెల సిందూరాన్ని తుడిచివేసిన పర్యవసానమేమిటో నేడు ప్రతి ఉగ్రవాదికి, ప్రతి ఉగ్రవాద సంస్థకు తెలిసివచ్చింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు కాదు, కోట్లాది భారతీయుల మనోభావాలకు ప్రతిబింబం'... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోని మాటలవి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఆపరేషన్ సిందూర్‌లో ఒక విరామం మాత్రమేనని దేశ ప్రజలు విశ్వసించేలా చేసేందుకు ఆయన ప్రయత్నించారు. మోదీ స్వాభావిక వాక్చాతుర్యం, శ్రోతలను సమ్మోగ్ధం చేసే మాటకారితనం ఆ ప్రసంగంలో బాగా కనిపించాయి.
ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు భారీ నష్టాన్ని కలిగించడంలో ఆపరేషన్ సిందూర్ సఫలమయిందని మోదీ అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రాతిపదికన కొత్త లక్ష్మణ రేఖలు నిర్దేశిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే జరుగుతాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఇస్లామాబాద్ పాలకులు అణ్వస్త్రాల బూచిని చూపుతూ పాల్పడుతున్న బ్లాక్ మెయిల్‌కు భారత్ బెదరదు, జడవదు అని, మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే కఠినంగా ప్రతిస్పందించేందుకు భారత సైన్యం సదా యుద్ధ సన్నద్ధమై ఉందని నరేంద్రమోదీ హెచ్చరించారు. ఒకపక్క, ఇక్కడ, ఇలా, భారత రాజకీయాల శక్తిమంతుడు తాను పాకిస్థాన్‌ను కాళ్ళబేరానికి రప్పించాకనే కాల్పుల విరమణ జరిగిందంటూ టీవీలో ప్రసంగిస్తుండగానే అక్కడ వేలమైళ్ళ దూరంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ కథనానికి వరుస తూట్లుపొడిచాడు. తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తీవ్ర ప్రయత్నాలు చేసి దక్షిణ ఆసియాలోని రెండు అణ్వస్త్ర రాజ్యాలను కాల్పుల విరమణకు ఒప్పించామని ట్రంప్ పేర్కొన్నారు.
ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ఉండేందుకు మోదీ కంటే ఎక్కువగా ట్రంప్ ఆరాటపడడం గత కొద్ది రోజుల్లో ఇది మూడోసారి. కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు ప్రకటించకముందే ట్రంప్ ఆ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. మరి కొద్ది గంటల్లోనే, భారత్, పాకిస్థాన్‌లకు నచ్చచెప్పేందుకు అమెరికా ప్రభుత్వం రాత్రికి రాత్రి చేసిన ప్రయత్నాల గురించి సవివరంగా ట్వీట్ చేశారు. కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానని కూడా ఆయన ప్రతిపాదించారు. మే 12న వైట్ హౌజ్‌లో మీడియా రోజువారీ గోష్ఠిలో ట్రంప్ ఆశువుగా చేసిన వ్యాఖ్యలు ఇంటా బయటా అసాధారణ వ్యక్తిలా వ్యవహరించే ప్రధాని మోదీని చిన్నబుచ్చేవిగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తామని ఉభయ దేశాల ప్రధానమంత్రులకు గద్దించి చెప్పడం ద్వారా ఈ ఘర్షణ నుంచి విరమించుకునేలా చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా ట్రంప్ తనను వెంటాడడం కొనసాగుతుండడంతో సర్వత్రా తనకు ప్రచారాన్ని, ప్రాధాన్యాన్ని పొందడంలో అనితరసాధ్యుడైన మోదీ, ఇప్పుడు ఆ విషయంలో ఇబ్బందుల్లో పడ్డారు! భారత్ పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణలు తమ ప్రయత్నాల వల్లనే నిలిచిపోయానని అమెరికా ఘనంగా చెప్పుకున్న అంశాన్ని, కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానన్న ట్రంప్ ప్రతిపాదనను ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట మాత్రంగానైనా స్పృశించకుండా యథావిధిగా తన ఉద్వేగపూరితమైన ప్రసంగంలో ప్రజలను ముంచెత్తారు. పాకిస్థాన్ నాయకులు తమ ప్రసంగాల్లో అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపగా, అమెరికా ఉనికిని భారత్ కనీసమాత్రంగానైనా అంగీకరించలేదు. భారతీయ ఆడపడుచుల నుదుటి 'సిందూరం'ను ఉగ్రవాదులు తుడిచేశారని మోదీ తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను పురిగొల్పారు.
అమెరికా వ్యాఖ్యలు, వాటిపై నరేంద్ర మోదీ మౌనం వహించడం ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు వీలు కల్పించింది.
ప్రధానమంత్రిని 'విశ్వగురు'గా ఆరాధిస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులను ఈ పరిణామం కలవరపరుస్తోంది. మోదీ తన విదేశీ పర్యటనలలోను లేదా భారత్ పర్యటనకు వచ్చిన అంతర్జాతీయ నాయకులను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకోవడం లేదా అభినందనపూర్వకంగా వారి వెన్నుచరచడం పరిపాటి. అలాంటిది ఇప్పుడు ట్రంప్ ఆయన్ను, పాకిస్థాన్ ప్రధానమంత్రిని సమరీతిలో గౌరవించడం, ఇరువురినీ ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాగా పేర్కొనడం ద్వారా మోదీని తీవ్ర ఇబ్బందికి లోను చేశారు. ట్రంప్ తీరుతో మోదీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. విధేయ మీడియా, సామాజిక మాధ్యమాల శ్రేణులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ జరిగిన నష్టాన్ని భర్తీచేయడం అసాధ్యంగా ఉన్నది.
ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే అవకాశం వ్యర్థమయిందని వారి బాధ. ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా తీవ్రమయ్యేందుకు వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. పహల్గాం ఊచకోతలకు ప్రతీకారంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య రగుల్కొనే సైనిక ఘర్షణల గురించి ఈ యుద్ధోన్మాదులు అసాధారణ ఊహలు చేశారు. భారత సైనిక దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాయని, బంగ్లాదేశ్‌ను విముక్తం చేసినట్లుగానే బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ శృంఖలాల నుంచి విడిపిస్తాయని వారు ఆశించారు. కానీ, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టాలు వాటిల్లాయని నిరూపించే గట్టి సాక్ష్యాధారాలు ఏవీ ప్రజల దృష్టికి రాలేదు. పైగా పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది. ప్రధానమంత్రి వ్యవహరించిన తీరుపట్ల అసంతృప్తితో సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తాయి. కాల్పుల విరమణను ప్రకటించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా కూడా పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధాన్ని ప్రారంభించాలని సంఖ్యానేకులు డిమాండ్ చేశారు. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మే 13 రాత్రి మోదీ చాలా కఠినంగా మాట్లాడినప్పటికీ, ఆయన మాటలు వారి ఆవేశాన్ని తగ్గించలేకపోవచ్చు.
కశ్మీర్‌పై పాకిస్థాన్‌తో ఘర్షించడంలో ముందుకు సాగడంపై తమ మద్దతుదారుల ఆకాంక్షలు, అంచనాలను సహేతుకంగా ఉండేలా చేయడంలో ప్రధానమంత్రి, పాలక బీజేపీ చాలా కృషి చేయవలసిన అవసరమున్నది. తీవ్ర జాతీయవాద ఉన్మాదం లేదా దేశీయ రాజకీయాలలో తన ప్రభావ ప్రాబల్యాలు నిర్దేశించే విధానాలను అనుసరించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రధాని మోదీకి కచ్చితంగా తెలుసు. పాకిస్థాన్ సమీప భవిష్యత్తులో ఉగ్రవాద, సైనిక దుస్సాహసాలకు పాల్పడే అవకాశం లేదు కనుక భారత్‌కు తక్షణ సవాళ్లు దౌత్య రంగంలోనే ఎదురవుతాయి. అణుయుద్ధం కొద్దిలో తప్పిపోయిందని చెప్పడం ద్వారా కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ సమస్యగా చేసేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించి, సఫలమయ్యే అవకాశమున్నది. మే 7 అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్న ప్రధానాంశం ఒకటి ఉన్నది. అది: అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఉన్నందున పాత వ్యూహాత్మక నిశ్చితాలు ఏవీ ఇక చెల్లుబాటు కావు. అంతర్జాతీయ వ్యవహారాలలో తనను తాను ఒక స్వతంత్ర శక్తిగా పరిగణించుకుంటున్న ఇండియా తాత్కాలికంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి రావడం తప్పనిసరి. కశ్మీర్ వివాదంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని పాకిస్థాన్ మొదటి నుంచీ అంగీకరిస్తున్న దృష్ట్యా భారత్ సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవలిసి ఉంటుంది. ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ దౌత్య వ్యూహాలు పటిష్ఠంగా ఉండాలి. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి స్వయంగా చొరవ తీసుకోవాలి.

## అదే పల్లవి... భారత్-పాక్ కాల్పుల విరమణపై

# మరోసారి ట్రంప్ వ్యాఖ్యలు

భారత్-పాక్ కాల్పుల విరమణపై ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు

తాను జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దానని వెల్లడి

భారత్ వాదనలను తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు

వాణిజ్య చర్చలతోనే సంధి కుదిరిందని వ్యాఖ్య

ట్రంప్ ప్రకటనలను ఖండించిన భారత ప్రభుత్వం

కశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం వద్దని భారత్ స్పష్టీకరణ





ఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో తనదే కీలక పాత్ర అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. అమెరికా మధ్యవర్తిత్వంతోనే ఇది సాధ్యమైందని ఆయన చెప్పుకొచ్చారు. అయితే, ఈ వాదనలను భారత ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ఖండించినప్పటికీ, ట్రంప్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరంలో సైనికులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగంలో ఈ వ్యాఖ్యలు చేశారు. "గతవారం భారత్, పాకిస్థాన్ మధ్య మరింత ఉద్రిక్తంగా మారుతున్న సమస్యను పరిష్కరించడంలో నేను కచ్చితంగా సహాయం చేశాను. నేను చేశానని చెప్పడం కాదు కానీ... పరిస్థితి మరింత దిగజారి, వివిధ రకాల క్షిపణుల దాడులు జరిగే ప్రమాదం ఉండేది. మేం దాన్ని అదుపులోకి తెచ్చాం" అని ట్రంప్ అన్నారు. ఇరు దేశాలతో వాణిజ్యం గురించి మాట్లాడామని, "యుద్ధం వద్దు, వాణిజ్యం చేద్దాం" అని తాను సూచించానని, దీనికి పాకిస్థాన్, భారత్ రెండూ సంతోషంగా అంగీకరించాయని ట్రంప్ తెలిపారు. "వారు దాదాపు వెయ్యేళ్లుగా పోరాడుతున్నారు. నేను దాన్ని పరిష్కరించగలను అన్నాను. నేను దేన్నైనా పరిష్కరించగలను. నన్ను పరిష్కరించనివ్వండి అన్నాను, మేం దాన్ని పరిష్కరించాం. అందరూ చాలా సంతోషంగా ఉన్నారు" అని ట్రంప్ వివరించారు. అయితే, కాల్పుల విరమణ ఒప్పందానికి, అమెరికాతో వాణిజ్య చర్చలకు ఎలాంటి సంబంధం లేదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చల దశలోనే ఉందని, ఏదీ ఇంకా ఖరారు కాలేదని ఆయన గతంలో తెలిపారు. "చాలా అంశాలు ముడిపడి ఉన్నాయని, అన్నీ ఓ కొలిక్కి వచ్చే వరకు ఏదీ నిర్ణయించలేం" అని జైశంకర్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పిన ఘనతను దక్కించుకోవడానికి ట్రంప్ ప్రయత్నించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ట్రంప్ ఉప అధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఆయన వాదనలకు మద్దతు పలికారు. భారత్, పాక్‌ల మధ్య అణు యుద్ధం ముప్పును తాను నివారించానని ట్రంప్ పలుమార్లు చెప్పుకొచ్చారు. అయితే, అలాంటి అణు ఉద్రిక్తతలు ఏవీ లేవని భారత్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, దీర్ఘకాలంగా ఉన్న కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేస్తానన్న ట్రంప్ ప్రతిపాదనను కూడా భారత్ సున్నితంగా తిరస్కరించింది. కశ్మీర్ విషయంలో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఖాళీ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని భారత్ తేల్చిచెప్పింది. ట్రంప్ వాదనలను భారత మాజీ దౌత్యవేత్త కేపీ ఫాబియన్ కూడా ప్రశ్నించారు. "అమెరికా మధ్యవర్తిత్వం వహించలేదు. వారు పాకిస్థాన్‌ను ఒప్పించి ఉండొచ్చు... కానీ మాతో మాట్లాడమని అమెరికా చెప్పలేదు" అని ఆయన ఓ వార్తా సంస్థతో అన్నారు. మే 10న ప్రకటించిన ఈ కాల్పుల విరమణ ఒప్పందం, భారత గగనతలంలోకి పాకిస్థాన్ చొరబాట్లకు ప్రతిగా పాక్ సైనిక స్థావరాలపై భారత దాడుల అనంతరం కుదిరింది. ఈ ఒప్పందం మే 18 ఆదివారం వరకు పొడిగించబడింది.

# ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం...

## ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్

మూడు రోజుల సిట్ విచారణ అనంతరం అరెస్టు చేసిన అధికారులు

ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఈ కేసులో ఏ31, ఏ32 నిందితులుగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి







అమరావతి: ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విచారణ అనంతరం, నాటి ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డితో పాటు, అప్పటి సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించిన సిట్ అధికారులు, మద్యం కుంభకోణంలో వీరి ప్రమేయంపై స్పష్టత వచ్చిన తర్వాత ఈ సాయంత్రం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. దాదాపు తొమ్మిది గంటల పాటు వీరిద్దరినీ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ధనుంజయ్‌రెడ్డి ఏ31 నిందితుడిగా, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32 నిందితుడిగా ఉన్నారు. కాగా, ఇదే కేసులో వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తు అధికారి విచారణకు ఆటంకం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వీరి ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిల్ కోసం నిబంధనలు, మెరిట్స్ ఆధారంగా హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో, నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డితో పాటు భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను కూడా సిట్ ఇటీవల నిందితుల జాబితాలో చేర్చింది. ఈ కేసులో ఏ33 నిందితుడిగా ఉన్న గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు మంగళవారమే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని సిట్ కార్యాలయంలో గత మూడు రోజులుగా వీరి విచారణ కొనసాగింది. తాజాగా సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో వీరి అరెస్టుకు మార్గం సుగమమైంది.

# ఏఐ వ్యవస్థలను వాటి పాటికి వాటిని వదిలేస్తే ఏం జరుగుతుంది?

సొంతంగా సమాజాలు ఏర్పాటు చేసుకోగలవని తేలిన ఏఐ వ్యవస్థలు

పరస్పర చర్యలతో ప్రత్యేక భాషా నియమాలు, సంప్రదాయాల రూపకల్పన

మానవ సమూహాల మాదిరిగానే ఏఐలలోనూ సమష్టి ప్రవర్తన




లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ పరస్పర చర్యలపై శాస్త్రవేత్తల పరిశోధన ఏఐ భద్రత, మానవ విలువలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ ఫలితాలు కీలకం లామా, క్లాడ్ వంటి వివిధ ఏఐ మోడళ్లలోనూ ఇదే ప్రవర్తన నమోదు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో, మరో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. మనుషుల్లాగే ఏఐ వ్యవస్థలు కూడా తమకంటూ ప్రత్యేక సమాజాలను, భాషా నియమాలను, సంప్రదాయాలను ఏర్పాటు చేసుకోగలవని ఓ తాజా అధ్యయనం తేల్చింది. వాటిని వాటి మానాన వదిలేస్తే, అవి పరస్పరం సంప్రదింపులు జరుపుకుంటూ సొంత వ్యవస్థలను నిర్మించుకుంటాయని ఈ పరిశోధన స్పష్టం చేసింది. లండన్‌లోని సిటీ సెయింట్ జార్జ్స్ విశ్వవిద్యాలయం, కోపెన్‌హాగన్‌లోని ఐటీ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన నిర్వహించారు. ఏఐ సాధనాలకు వెన్నెముకగా నిలుస్తున్న లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఒకదానితో ఒకటి ఎలా సంకర్షణ చెందుతాయో అర్థం చేసుకోవడమే ఈ అధ్యయనం ముఖ్య ఉద్దేశం. ఈ పరిశోధన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధకులు ఈ ప్రయోగం కోసం ఒక 'నేమింగ్ గేమ్' (పేర్లు పెట్టే ఆట)ను ఉపయోగించారు. ఇందులో ఏఐ ఏజెంట్లు కొన్ని పేర్ల సముదాయం నుంచి పేర్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒకే పేరును ఎంచుకున్నందుకు వాటికి ప్రోత్సాహకాలు లభిస్తాయి. కాలక్రమేణా, ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకత్వం లేకుండానే ఏఐ ఏజెంట్లు ఉమ్మడి సంప్రదాయాలను, పక్షపాతాలను అభివృద్ధి చేసుకున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మానవులు కూడా ఒకే రకమైన నిబంధనలకు కట్టుబడి ఉండే అలవాటును ఏఐ ఏజెంట్లు అనుకరించాయని పరిశోధకులు తెలిపారు. అంతేకాకుండా, ఓ చిన్న ఏఐ ఏజెంట్ల సమూహం, పెద్ద సమూహాన్ని ఒక నిర్దిష్ట సంప్రదాయం వైపు నడిపించడం కూడా సాధ్యమైందని, ఇలాంటి లక్షణం తరచుగా మానవ సమూహాల్లో కనిపిస్తుందని వారు పేర్కొన్నారు. "మా ఫలితాలు ఏఐ వ్యవస్థలు ఎలాంటి బాహ్య ప్రోగ్రామింగ్ లేకుండా స్వయంప్రతిపత్తితో సామాజిక సంప్రదాయాలను అభివృద్ధి చేసుకోగలవని చూపిస్తున్నాయి. మానవ విలువలు, సామాజిక లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ వ్యవస్థలను రూపొందించడంలో ఈ ఫలితాలు ముఖ్యమైనవి" అని అధ్యయనం నొక్కి చెప్పింది. లామా-2-70బి-చాట్, లామా-3-70బి-ఇన్‌స్ట్రక్ట్, లామా-3.1-70బి-ఇన్‌స్ట్రక్ట్, క్లాడ్-3.5-సోనెట్ వంటి నాలుగు వేర్వేరు రకాల ఎల్ఎల్ఎంలను ఉపయోగించినప్పుడు కూడా ఫలితాలు స్థిరంగా ఉన్నాయని పరిశోధకులు తెలిపారు.

### నైతికపరమైన అంశాలు, భవిష్యత్తు

సమాజం నుంచి పొందిన పక్షపాతాలను వ్యాప్తి చేసే ఎల్ఎల్ఎం ఏఐల వల్ల తలెత్తే కొన్ని నైతిక ప్రమాదాలను ఎదుర్కోవడానికి తమ పరిశోధన ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ అధ్యయనం సీనియర్ రచయిత ఆంద్రియా బారోన్‌చెల్లి మాట్లాడుతూ, "ఈ అధ్యయనం ఏఐ భద్రతా పరిశోధనలకు కొత్త మార్గాలను తెరుస్తుంది. మనతో సంకర్షణ చెందడం ప్రారంభించిన ఈ కొత్త రకం ఏజెంట్ల ప్రభావం ఎంత లోతుగా ఉంటుందో ఇది చూపుతుంది. ఇవి మన భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయి" అని అన్నారు. "మనం ఏఐ కేవలం మాట్లాడటమే కాకుండా, మనలాగే చర్చలు జరిపే, సర్దుకుపోయే, కొన్నిసార్లు ఉమ్మడి ప్రవర్తనలపై విభేదించే ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నాం" అని ఆయన జోడించారు.

# 'హరీష్ పై కేటీఆర్‌కు ఎందుకంత ప్రేమో..'



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందంటూ ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని స్పష్టం చేసిన రామచంద్రనాయక్.. ఎప్పుడూ లేని విధంగా హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లడమే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. 'పార్టీ ప్లీనరీ సమయంలో హరీష్ రావు కు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆయనకు అంత సీను లేదని చెప్పారు. రెండు గంటలకు పైగా హరీష్ రావుతో చర్చలు జరిపారు. గతంలో ఎప్పుడూ హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లలేదు.హరీష్ రావు ఇంట్లో గతంలో పంక్షన్ జరిగినా కేటీఆర్, ఆయన కుటుంబం దూరంగా ఉంటూ వచ్చింది. ఇప్పుడు సడన్‌గా హరీష్ రావు పైన కేటీఆర్‌కు ఎందుకంత ప్రేమ వచ్చిందో చెప్పాలి. హరీష్ రావు కొత్త పార్టీ పెడుతున్నాడని ప్రచారం జరుగుతోంది. కల్వకుంట్ల కవిత ఇప్పటికే పార్టీ కి వ్యతిరేకంగా బహిరంగంగా విమర్శలు చేస్తున్నాడు. తన మీద దుష్ప్రచారం జరుగుతోందని, దాని వెనుక ఎవరున్నారో తనకు తెలుసునని కవిత అంటోంది. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబ సభ్యుల మధ్య ఆధిపత్యపోరు జరుగుతోంది. రాజకీయ ఆధిపత్యం కోసం కొట్లాడుకుంటున్నారు. హరీష్ రావు తో చర్చల మతలబు ఏమిటో ప్రజలకు కేటీఆర్ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. సుమారు రెండు గంటల పాటు హరీష్‌తో భేటీ అయ్యారు. ఇటీవల అస్వస్థతకు గురైన హరీష్ రావు తండ్రి ఆరోగ్య వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కోకాపేట హరీష్‌రావు నివాసంలో సమావేశమైన ఇరువురు నేతలు.. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. హరీష్ రావు పార్టీ మారతారన్న ప్రచారంపై సైబర్ సెల్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాను పార్టీ లైన్ దాటనని ఇటీవల హరీష్‌రావు ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని హరీష్‌రావు మరోసారి స్పష్టం చేశారు. కేటీఆర్‌కు పార్టీ పగ్గాలు అప్పగించిన కానీ.. పని చేస్తానని హరీష్‌రావు తెలిపారు. వరంగల్ సభ తర్వాత పార్టీలో హరీష్‌రావు ప్రాముఖ్యత తగ్గిందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం మండిపడుతోంది. దీంతో నేరుగా హరీష్ రావుతో మాట్లాడి సమస్యకు ఫుల్ స్టాప్ పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కేటీఆర్ సమావేశమైనట్లు సమాచారం.

# 'సీఎంకు, డిప్యూటీ సీఎంకు మధ్య విభేధాలు'



హైదరాబాద్: రాష్ట్రం దివాలా తీసిందన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి వర్గం అసంతృప్తిగా ఉందన్నారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. శుక్రవారం మీడియాతో చిట్ చాట్ లో భాగంగా మాట్లాడుతూ..' సీఎం రేవంత్ కు, డిప్యూటీ సీఎంకు మధ్య విబేధాలు ఉన్నాయి. అందుకే సీఎం కామెంట్స్ ను మంత్రులు ఎవరూ సమర్థించలేదు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్ రెండుగా చీలిపోయింది. రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని ఒరిజినల్ కాంగ్రెస్ మంత్రులు బాధపడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణను సీఎం రేవంత్ అడ్డుకుంటున్నారు. కొత్తగా వచ్చేవారు సైతం వ్యతిరేకంగా ఉంటారని సీఎం రేవంత్ భావన. అందుకే గందరగోళ నివేదికలు హైకమాండ్ కి పంపి అడ్డుకుంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఎక్కడ బీసీలకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాల్సి వస్తుందోనని జగన్నాటకం ఆడుతున్నారు. రేవంత్ లోపాలు, తప్పిదాలు అన్ని హైకమాండ్ దగ్గర ఉన్నాయి. లోకల్ బాడీ ఎన్నికలు జరిగితే సీఎంను మార్చాలని హైకమాండ్ ఎదురుచూస్తోంది' అని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'

## విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అత్యధికంగా 17, 162 మెగా వాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26 లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని, 2034..35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. రైల్వే లైన్లు, మెట్రో , ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోంది. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సీటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలి. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# గూగుల్ కొత్త ఫీచర్.. కొట్టేసిన ఫోన్ పనిచేయదు!



ఫోన్ల చోరీకి చెక్ పెట్టేందుకు గూగుల్ కొత్త ఫీచర్‌ను తీసుకురాబోతోంది. చోరీకి గురైన ఫోన్లను దాదాపు నిరుపయోగంగా మార్చే లక్ష్యంతో గూగుల్ ఆండ్రాయిడ్ 16తో ముఖ్యమైన యాంటీ-థెఫ్ట్ ఫీచర్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ అప్‌డేట్‌లో మెరుగైన భద్రతా సాధనాలు ఉంటాయి. ఇవి "ఓనర్ అనుమతి లేకుండా రీసెట్ చేసిన ఫోన్‌లు పనిచేయకుండా అవుతాయి" అని ఆండ్రాయిడ్ పరికరాల సమాచారాన్ని తెలిపే 'ఆండ్రాయిడ్ పోలీస్' అనే వెబ్‌సైట్ నివేదిక తెలిపింది. గూగుల్ ఇటీవల 'ది ఆండ్రాయిడ్ షో: ఐ/ఓ ఎడిషన్' సందర్భంగా ఈ కొత్త ఫీచర్‌ను ఆవిష్కరించింది. ఇది ప్రాథమికంగా ఫ్యాక్టరీ రీసెట్ ప్రొటెక్షన్ (ఎఫ్ఆర్‌పీ) ను పెంచుతుంది. ఇది చోరీకి గురైన ఫోన్లను నిరుపయోగంగా చేయడానికి రూపొందించిన భద్రతా ఫీచర్. గూగుల్ ఆండ్రాయిడ్ 15 లో ఎఫ్ఆర్‌పీకి అనేక మెరుగుదలలు చేసింది. తదుపరి ఆండ్రాయిడ్ అప్డేట్ దీనిని మరింత బలోపేతం చేస్తుంది. ఈ కొత్త ఫీచర్ గురించి గూగుల్ అధికారికంగా ఏమీ చెప్పనప్పటికీ, గూగుల్ ప్రణాళికలను తెలియజేసే ఒక స్క్రీన్ షాట్ ను ఆండ్రాయిడ్ పోలీస్ పబ్లిష్ చేసింది. ఈ స్క్రీన్ షాట్ ఫోన్ స్క్రీన్ పై ఫ్యాక్టరీ రీసెట్ వార్నింగ్ ఫ్లాషింగ్ ను చూపిస్తోంది. ఫోన్‌ను దొంగిలించినవారు ఒకవేళ సెటప్ విజార్డ్ ను చేయకపోతే రీసెట్ చేయకుండా ముందుకెళ్లలేరు. అంటే యూజర్ ఫోన్‌ను రీసెట్ చేసి మునుపటి లాక్ స్క్రీన్ లాక్ లేదా గూగుల్ ఖాతా క్రెడెన్షియల్స్‌ను నమోదు చేసే వరకు ఫోన్ పనిచేయదు. ఆండ్రాయిడ్ పోలీస్ ప్రకారం.. కొత్త ఫీచర్ ఈ సంవత్సరం చివరలో విడుదలయ్యే అవకాశం ఉంది.

# ముక్తిదాయకం.. పుష్కర స్నానం




కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. 'మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యౌ మునీనాంహి బుధై స్మృతా' దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభరాశిలో ఉన్నప్పుడు సింధునదికి, మీనరాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి పుష్కరాలు చెప్పబడ్డాయి. పుష్కరం అనగా జలస్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోకకళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపుతున్నాయి. పూర్వం తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట-మూర్తులతో ఒకటైన జల స్వరూపంతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరం పొంది, పరమేశ్వరుని సాయుజ్యం పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతం చేయుటకై శివుని వరంతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలంలో ఉంచుకొని సృష్టికార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహాధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆ పుష్కరుని సన్నిధిని శక్తివంతుడై యుండునట్లు కోరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించుచున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ -గంగా) అను సూత్రానుసారం పుష్కరాలు నిర్వహిస్తారు. ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్య, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు. సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది. అలాగే ప్రయాగరాజ్‌లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరంలో ఈ పుష్కరాలు జరగనున్నాయి. కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. పచ్చని ప్రకృతి మధ్య నెలకొని ఉన్న ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. మొత్తం మీద, సరస్వతీ నదీ పుష్కరాలు ఒక పవిత్రమైన సందర్భం. ఇది నదీమాతకు కృతజ్ఞతలు తెలుపుకునే సమయం, ఆధ్యాత్మిక చింతనకు, పవిత్ర స్నానాలకు ప్రాధాన్యతనిచ్చే సమయం. కాళేశ్వరం వంటి క్షేత్రాలలో ఈ పుష్కరాలను నిర్వహించడం ఆ ప్రాంతానికి మరింత పవిత్రతను చేకూరుస్తుంది. భక్తులు ఈ సమయంలో పాల్గొని పుణ్యం పొందాలని ఆశిస్తారు. సరస్వతీ నది కేవలం ఒక నీటి ప్రవాహం కాదు. అది జ్ఞానానికి, వివేకానికి, పవిత్రతకు చిహ్నం. ఈ పుష్కరాల సమయంలో ఆ నదిలో స్నానం చేయడం ద్వారా భక్తులు తమ ఆంతరంగిక శుద్ధిని పొందుతారని విశ్వసిస్తారు. ఈ పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తారు. సరస్వతీ నదీ పుష్కరాలు ముక్తిని ప్రసాదించే ఒక గొప్ప అవకాశం.

# ట్రంప్ ఎవరికీ అర్థంకారు



డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్- ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది.ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండించింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు. ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విద్వారంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్- పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలి అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయంతో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.

# 'కుట్రతోనే లిక్కర్ స్కామ్ అంటూ అక్రమ కేసు'



కాకినాడ: తమ ప్రభుత్వ హయాంలో పూర్తి పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తూ,వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టే లక్ష్యంతో పని చేస్తోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాల్లో నిజంగా తప్పు జరిగి ఉంటే, నిష్పాక్షికంగా జరిపే ఎలాంటి విచారణనైనా స్వాగతిస్తామని ఆయన వెల్లడించారు. కానీ రాజకీయ దురుద్దేశాలతో తప్పుడు విచారణల పేరుతో వేధింపులకు పాల్పడితే సహించేది లేదని, ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండ గడతామని కాకినాడలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ తేల్చి చెప్పారు.

## బొత్స ఇంకా ఏం మాట్లాడారంటే..

కూటమి ప్రభుత్వం దారుణ వ్యవహారం

కూటమి ఏడాది పాలనలో పార్టీల హనీమూన్ ముగిసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కింది. కూటమి పాలనలో అవినీతి, దోపిడీ తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. రాజకీయ కక్ష సాధింపులకే మొత్తం సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఎన్నికల మందు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా తప్పించుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు పెట్టుబడి సాయం, ప్రతి కుటుంబానికి ఏటా మూడు ఉచిత సిలిండర్లు, ఏటా 4 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా ఒక్కో నిరుద్యోగికి రూ.3 వేల భృతి, ఆడబిడ్డ నిధి కింది ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. కానీ, ఏడాది గడుస్తున్నా వాటిలో ఏదీ అమలు చేయడం లేదు. మరోవైపు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా అంతులేని అవినీతి. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా కేవలం 99 పైసలకే దాదాపు 3 వేల కోట్ల విలువైన భూముల అప్పగింత. ఇంకా కాకినాడలో బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ.. 'సీజ్ ది షిప్' అని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నానా హంగామా చేశారు. ఒక్క బియ్యం గింజ కూడా అక్రమంగా రవాణా చేయడానికి వీలులేదని అన్నారు. కానీ ఒక్క దానిపైనా చర్యలు లేవు. పోలీసుల జులుంతో ప్రభుత్వాన్ని నడిపించాలని చూస్తున్నారు. అందుకే ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తున్నారు.

## తెచ్చిన అప్పులు దేనికి ఖర్చు చేశారు?

ఏడాది పాలనలోనే ఏకంగా రూ.1.59 లక్షల కోట్లు అప్పులు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంతలా ఏడాదిలో అప్పులు చేయలేదు. ఇంత అప్పులు తెచ్చి ఏ ప్రజా సంక్షేమ కార్యక్రమానికి ఖర్చు చేశారు? మా హయాంలో అప్పులు చేసినా, వివిధ పథకాల కింద రూ.2.73 లక్షల కోట్లు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. మరి కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు దేనికి వినియోగించారో చెప్పాలి. సంపద సృష్టిస్తాను. అది తనకు బాగా తెలుసు అని ప్రచారం చేసిన చంద్రబాబు, మరి ఇన్ని అప్పులు, ఇంత తక్కువ సమయంలో ఎందుకు చేశారు? అప్పు చేయడం. ప్రచార ఆర్భాటాలకు ఖర్చు చేయడం చంద్రబాబుకు బాగా అలవాటు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొంత అప్పు చేసినా, ఆ ఖర్చులకు ఒక అర్థం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, తీర ప్రాంతాల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, భోగాపురం ఎయిర్‌పోర్ట్.. ఇలా ఉత్పాదకతకు దోహదం చేసే వాటికి ఖర్చు చేశాం. మాట ఇస్తే, దాన్ని తప్పకుండా నెరవేర్చాలనేది జగన్‌గారి విధానం. అందుకే ఎన్నికల ముందు, టీడీపీ కూటమి మాదిరిగా, అడ్డగోలు హామీలు ఇవ్వలేదు.

## పార్టీ కార్యాచరణ. నిర్ణయాలు

వైఎస్సార్‌సీపీ అయిదు జిల్లాల ముఖ్య నేతలతో ఈరోజు (శుక్రవారం) సమావేశం నిర్వహించాం. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో సంస్థాగతంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీల ఏర్పాటు, ప్రతి జిల్లాలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై నిర్ణయం తీసుకున్నాం. అలాగే గోదావరి జిల్లాల్లో ధాన్యం సేకరణపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడంతో పాటు, తీర ప్రాంతాల్లోని ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని నిర్ణయించడం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో పొగాకు రైతులు మద్దతు ధర లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ పొగాకు రైతులు ఇదే సమస్యలపై ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పొగాకు రైతులను కలిసి నేరుగా వారితో మాట్లాడనున్నారు. తదుపరి పొగాకు కొనుగోళ్ళపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ పరంగా కార్యాచరణను ఖరారు చేయడం జరుగుతుంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పొగాకు మద్దతు ధర లభించని సందర్భంగా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆ మొద్దునిద్ర నుంచి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు రైతుల పక్షాన పోరాడతామని బొత్స సత్యనారాయణ హెచ్చరించారు.